ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -86 పేజీలు - 8 వెల - 03/- బుధవారం 15 జులై 2026

# ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

**కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవియాకు మంత్రుల కృతజ్ఞతలు**




**హైదరాబాద్,జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**
8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను కేంద్ర యువజన వ్యవహారాలు / క్రీడల శాఖ మంత్రి మన్సుక్ మాండవియాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ **మిగతా 2లో...**

# బిజినెస్‌రూల్స్‌లో సంస్కరణలు

**ఆర్టీజీఎస్ సమీక్షలో దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబు**



- క్రౌడ్ సోర్సింగ్ ద్వారా ఫిర్యాదుల సమాచారం
- ఫైళ్ల క్లియరెన్స్ పేరిట అభివృద్ధి ఆలస్యం కాకూడదు
- అవకాశాలు అందిపుచ్చుకునేలా నిబంధనల్లో వెసులుబాటు
- 2017తో పోలిస్తే రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 20 శాతం వృద్ధి నమోదు



**అమరావతి,జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):** ప్రభుత్వ పాలనలో టెక్నాలజీ అనుసంధానం ద్వారా అవసరం లేని బిజినెస్ రూల్స్‌ను సంస్కరించుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బిజినెస్ రూల్స్ రీ డ్రాఫ్ట్ చేసేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేసి సంస్కరణలు తీసుకురావాలని సీఎం నిర్దేశించారు. సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సు కేంద్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు **మిగతా 2లో...**

# ట్రంప్ యూటర్న్

**:హార్ముజ్ పై 20 శాతం టోల్ ప్రతిపాదన వెనక్కి**

**ఢిల్లీ జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హార్ముజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు **మిగతా 2లో...**






# ఏపీలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ..

- గడువును జులై 24 వరకు పెంచుతూ ఈసీఐ నిర్ణయం
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అభ్యర్థన మేరకు సవరించిన షెడ్యూల్ విడుదల
- ఇప్పటివరకు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ పూర్తి

**అమరావతి,జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**
ఏపీలో ఓటర్ల జాబితాకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును జులై 24వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి ఈ గడువు నేటితో (జులై 14) ముగియాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తికానందున గడువును**మిగతా 2లో...**

## కాపు ఉద్యమ నేత

# ముద్రగడ కన్నుమూత

**చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి**



**హైదరాబాద్ జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**
వైసీపీ నేత ముద్రగడ పద్మనాభరెడ్డి(73) మృతిచెందారు. అనారోగ్య సమస్యలతో చికిత్సపొందుతూ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ఆయన తుదిశ్వాస విడిచారు. కిడ్నీ సమస్యలతో గత నెల 16న హైదరాబాద్ గచ్చిబౌలిలోని **మిగతా 2లో...**

# టీటీడీ ట్రస్టులు, పథకాల దాతల ప్రివిలేజెస్‌లో కీలక మార్పులు

- సామాన్య భక్తుల కోసం తిరుమలలో రూ.6.31 కోట్లతో శాశ్వత షెడ్ల నిర్మాణం
- ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో 100 గదుల నిర్మాణానికి టెండర్లకు ఆమోదం
- వేద పారాయణ స్కీం కింద 791 మంది వేద పండితులను నియమించాలని నిర్ణయం
- ఎస్వీ మ్యూజియం ప్రవేశ రుసుము రూ.50గా ఖరారు, నిర్వహణపై టాటాతో చర్చలు

**తిరుమలజూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**
తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. టీటీడీ పరిధిలోని వివిధ ట్రస్టులు, పథకాలకు విరాళాలు ఇచ్చే దాతలకు కల్పించే ప్రత్యేక సౌకర్యాలు (ప్రివిలేజెస్)లో మార్పులు చేస్తున్నట్లు ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. ఈ కొత్త



# నెలవారీ ఆర్థిక నివేదిక

## దేశంలోనే తొలిసారిగా

- డేటా ఆధారిత పాలనలో భాగంగా ప్రభుత్వం వినూత్న ప్రయత్నం
- వివిధ రంగాల ప్రగతిని రియల్ టైమ్‌లో పర్యవేక్షించేందుకు కొత్త విధానం
- స్వర్ణాంధ్ర-2047 విజన్ సాధనకు ఇది దోహదపడుతుందన్న పయ్యావుల



**అమరావతి,జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ పాలనలో వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతున్నామని, డేటా ఆధారిత పాలన (డేటా డ్రివెన్ గవర్నెన్స్) దిశగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. దేశంలోనే తొలిసారిగా నెలవారీ ఆర్థిక నివేదికల (మంత్లీ ఎకనామిక్ రిపోర్ట్స్) ఆధారంగా ప్రభుత్వ పాలనను ముందుకు తీసుకెళ్లనున్నట్లు ఆయన ప్రకటించారు.**మిగతా 2లో...**

# అంతర్జాతీయ ప్రమాణాలతో విమానాశ్రయాలను నిర్మించండి

- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ ఎయిర్‌పోర్టు
- ఆదిలాబాద్ భూసేకరణ చేపడతాం : కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**
తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా ఈ రెండు విమానాశ్రయాలకు ఉన్న సానుకూల అవకాశాలు, పరిస్థితులను సీఎం వివరించారు. మంగళవారం ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయంలో రాజీవ్ గాంధీ భవన్‌లో **మిగతా 2లో...**



# ఏసీబీ వలలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారి..

- హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్‌పై ఏసీబీ కేసు
- అక్రమాస్తుల ఆరోపణలపై ఏకకాలంలో సోదాలు
- రికార్డుల ప్రకారం రూ.9.24 కోట్ల విలువైన ఆస్తులు గుర్తింపు



**హైదరాబాద్ జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) చీఫ్ ఇంజనీర్ బి. రవీందర్‌పై తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో మంగళవారం ఏకకాలంలో పలుచోట్ల సోదాలు నిర్వహించిన అధికారులు,**మిగతా 2లో...**

## మత్స్యకార కుటుంబాలకు

# జగన్ అండ





- ఒక్కో కుటుంబానికి 7లక్షల సాయం ప్రకటన
- బోటు ప్రమాదం జరిగిన వెంటనే స్పందించని సర్కార్
- ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది
- మత్స్యకార కుటుంబాలకు జగన్ పరామర్శ
- సర్కార్ తీరుపై మండిపడ్డ వైసిపి అధినేత

**విశాఖపట్నం,జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**
విశాఖలో బోటు ప్రమాదం జరిగిన వెంటనే చంద్రబాబు సర్కార్ ఎందుకు స్పందించలేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలదీశారు. విశాఖలోని జబ్బర్‌తోటలో మత్స్యకార **మిగతా 2లో...**

# బిజినెస్‌రూల్స్‌లో సంస్కరణలు

**మొదటిపేజీ తరువాయి**

అందిస్తున్న పౌరసేవలు, రాష్ట్రంలో యూరియా లభ్యతపై ముఖ్యమంత్రి సమీక్షించారు. దేవాదాయ, రహదారులు భవనాలు, ఏపీఎస్ఆర్టీసీ, రవాణా,అగ్నిమాపక, వ్యవసాయ శాఖలు అందిస్తున్న వివిధ సేవలు, ప్రజల నుంచి వ్యక్తం అవుతున్న సంతృప్త స్థాయిపై సీఎం సూచనలు జారీ చేశారు. ప్రోయాక్టివ్ గవర్నెన్సు అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఉన్నతాధికారులు సరైన నాయకత్వం అందిస్తేనే చిట్టచివరి వ్యక్తి వరకూ పాలనా ఫలితాలు అందుతాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలతో మెరుగైన ఫలితాలు అందేలా నిర్ణయాలు ఉండాలని సీఎం సూచించారు. దేవాదాయశాఖలో ప్రసాదాల నాణ్యతతో పాటు ఆధ్యాత్మికతను మరింత పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని 21 ప్రముఖ దేవాలయాల్లో విస్తృతమైన పొటెన్షియల్ ఉందని .. సరైన ప్రణాళిక ద్వారా వీటిని గ్రోత్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని సూచనలు ఇచ్చారు. ఈ దేవాలయాలను ఆనుకుని ఆర్థిక కార్యకలాపాలు విస్తృతంగా పెరగాలన్నారు. పర్యాటక కార్యకలాపాలు పెరిగేందుకు కూడా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇక నుంచి అన్ని ఫిర్యాదులకు సంబంధించి క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సమాచారం తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతీ అర్జీదారుకూ తగిన సమాధానం కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. అగ్నిమాపక శాఖలో సేవల ప్రమాణాల్ని పెంచాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియా సరఫరాపై రైతు సంఘాలు, ఆర్ఎస్‌కేల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని... యూరియా దుర్వినియోగం కాకుండా చూడాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**మానవీయ కోణంలో అర్జీల పరిష్కారం**

క్షేత్రస్థాయిలో ఉద్యోగులు, అధికారులు తప్పు చేస్తే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని.. దీన్ని దృష్టిలో పెట్టుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి సూచించారు. అన్ని బస్టాండ్‌లలోనూ ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగుపర్చాలన్నారు. బస్సులు ఖచ్చితమైన సమయానికి వచ్చే అంశంపై దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. గత పాలనలో రాజకీయ కక్షతో కొందరి భూముల్ని 22ఏ కింద పెట్టి వివాదంలోకి నెట్టారన్నారు. ఇప్పటికి 27 లక్షల మందికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, ఇంకా 72 లక్షల మందికి జారీ చేయాల్సి ఉందన్నారు. శెట్టిపల్లి భూ వివాదాన్ని పరిష్కరించటం ద్వారా రైతుల సమస్యలు తీరటంతో పాటు 900 కోట్ల విలువైన భూమి ప్రభుత్వానికి వచ్చిందన్నారు. ఇలాంటి అవకాశాలనే అన్ లాక్ చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. పీజీఆర్ఎస్‌తో పాటు వివిధ రకాలుగా వచ్చే ప్రతీ అర్జీ, ఫిర్యాదునూ మానవతా కోణంతో పరిష్కరించాలని సీఎం సూచించారు. ఆర్థిక, ఆర్థికేతర అంశాలతో పాటు వ్యక్తిగత, సామాజిక అంశాల్లో వచ్చే ఫిర్యాదులపై తగిన నిర్ణయాలు వేగంగా తీసుకోవాలన్నారు. రొటీన్‌గా ఉండే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అప్పుడే ప్రజల్లో సంతృప్తి వ్యక్తం అవుతుందని అన్నారు. గ్రీవెన్స్‌ల పరిష్కారం ఆధారంగా ఫిర్యాదులు తగ్గుతున్నాయా లేక పెరుగుతున్నాయో విశ్లేషించాలన్నారు. సమస్యలు పరిష్కారం అయితే ఫిర్యాదుల సంఖ్య తగ్గుతుందన్నారు. ఆర్టీజీఎస్ రూపొందించిన గవర్నెన్స్ డట్ నెవర్ స్లీప్స్ మాసపత్రికను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు మంత్రి పార్థసారధి వర్చువల్‌గా, ఆర్టీజీఎస్ నుంచి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఏపీలో 'ఎస్‌ఐఆర్' గడువు పొడిగించిన ఈసీఐ..

**మొదటిపేజీ తరువాయి**

పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) చేసిన విజ్ఞప్తికి ఈసీఐ సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు సవరించిన కొత్త షెడ్యూల్‌ను విడుదల చేసింది.

**గడువు పెంపునకు దారితీసిన కారణాలు**

గత నెల రోజులుగా ఏపీ వ్యాప్తంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సరిచూసే ఎస్‌ఐఆర్ ప్రక్రియను చేపట్టారు. జులై 13 నాటికి దాదాపు 88 శాతం ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ మాత్రమే పూర్తయింది. నిర్దేశిత గడువు సమీపిస్తున్నా ప్రక్రియ వంద శాతం పూర్తికాకపోవడంతో, గడువును పొడిగించాలని పలు రాజకీయ పార్టీలు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనాను కోరాయి. పార్టీల విజ్ఞప్తులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న సీఈవో.. ఎస్‌ఐఆర్ ప్రక్రియను సమగ్రంగా పూర్తి చేసేందుకు మరింత సమయం అవసరమని పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఈ అభ్యర్థనను పరిశీలించిన ఈసీఐ, గడువు పొడిగింపునకు అంగీకారం తెలిపింది.

**సవరణలో వెల్లడైన కీలక గణాంకాలు**

ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోలు మొత్తం 4,16,26,144 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. సోమవారం నాటికి 3,69,50,812 మంది ఓటర్ల వివరాలను డిజిటలైజ్ చేశారు. ఈ ప్రక్రియలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా 14,19,644 మంది ఓటర్లు మరణించినట్లు అధికారులు గుర్తించారు.
అలాగే, ఉపాధి, వివాహం, ఇతర కారణాలతో 12,14,994 మంది ఓటర్లు తమ చిరునామా నుంచి శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తేలింది. బీఎల్‌వోలు సర్వేకు వెళ్లిన సమయంలో 7,26,425 మంది ఓటర్లు ఇళ్ల వద్ద అందుబాటులో లేరని నివేదికలో పేర్కొన్నారు. ఇంకా 9 శాతానికి పైగా ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండటంతో, పొడిగించిన గడువులోగా వంద శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

**సవరించిన షెడ్యూల్ వివరాలు**

కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన కొత్త షెడ్యూల్ ప్రకారం సవరించిన తేదీలు ఈ విధంగా ఉన్నాయి:
ఎస్‌ఐఆర్ ప్రక్రియ చివరి తేదీ: జులై 24
ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురణ: జులై 31
అభ్యంతరాలు, చేర్పులు, మార్పుల స్వీకరణ: జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు
అభ్యంతరాలు, దరఖాస్తుల పరిష్కారానికి గడువు: సెప్టెంబరు 28
ఓటర్ల తుది జాబితా అధికారిక ప్రచురణ: అక్టోబరు 3
ఈ పొడిగించిన గడువుతో ఓటర్ల జాబితాను మరింత కచ్చితంగా, తప్పులు లేకుండా రూపొందించేందుకు అవకాశం లభించిందని అధికారులు భావిస్తున్నారు. ముసాయిదా జాబితా విడుదలైన తర్వాత పౌరులు తమ వివరాలను సరిచూసుకుని, ఏవైనా అభ్యంతరాలుంటే నిర్దేశిత సమయంలోగా తెలియజేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

# మత్స్యకార కుటుంబాలకు జగన్ అండ

**మొదటిపేజీ తరువాయి**

కుటుంబాలను ఆయన మంగళవారం పరామర్శించారు. బోటు ప్రమాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్ జగన్‌కు తమ కష్టాన్ని మత్స్యకారులు చెప్పుకున్నారు.. అనంతరం వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 1న ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లారు. కేవలం పది మైళ్ల దూరంలోనే ఘటన జరిగింది. జులైన 4న చిన్నా ఫోన్‌చేసి ఇంటికొస్తున్నామని చెప్పాడు. దురదృష్టవశాత్తు ఫోన్ చేసిన కాసేపటికే బోటు ప్రమాదం జరిగింది. ఫిషరీస్ అధికారులు కూడా స్పందించలేదని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బోటు ప్రమాదం జరిగిందని అధికారులకు మెసేజ్ చేశారు. రాత్రి 10:30కి కలెక్టర్, మెరైన్ సీఐకి మెసేజ్ పెట్టారు. వెంటనే స్పందిస్తే గంటల్లోనే మత్స్యకారులు దొరికేవారు. వెంటనే కోస్ట్‌గార్డ్ వచ్చి ఉంటే ఐదుగురైనా బతికేవారు. ఈనెల 5న చైనా బోటు సిబ్బంది చిన్నాను కాపాడారు. తప్పుడు జరిగింది కాబట్టే త్రీమెన్ కమిటీ వేశారు. త్రీమెన్ కమిటీ నివేదిక అంతా తప్పుల తడక. చంద్రబాబు ప్రభుత్వానికి మానవత్వం ఉందా? అంటూ వైఎస్ జగన్ ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే ఒక్క అధికారి రాలేదు. ఉత్తరాంధ్ర మంత్రులు ఒక్కరు కూడా రాలేదు. బాధితులను ఫిషరీష్ మంత్రి కూడా పరామర్శించలేదు. బాధితుల వద్దకు మంత్రులను పంపాలని సీఎంకు తెలియదా?. రాత్రికి రాత్రే స్పందిస్తే మత్స్యకారులు బతికేవారు. ఎక్స్ గ్రేషియా కింద అరకొర సాయం చేశారు. బాధితులకు రూ.కోటి చొప్పన ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి. ఏడుగురు మత్స్యకారులకు కుటుంబాలకు పరిహారం అందాలన్నారు. 5 లక్షలు ముష్టి వేస్తున్నావా.. ప్రతి కుటుంబానికి కోటి రూపాయలు, కొత్త ఇల్లుమన ప్రభుత్వం వచ్చాక నెలలోపే ఆదుకుంటాం. గతంలో మా ప్రభుత్వంలో మత్స్యకారులకు భరోసా ఉండేది. 2018 పాదయాత్రలో మత్స్యకారులకు ఇచ్చిన మాట నెరవేర్చాం. పాక్‌లో చిక్కుకున్న
మత్స్యకారులను సేఫ్‌గా తీసుకొచ్చాం అని వైఎస్ జగన్ గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మత్స్యకారుల కోసం 10 ఫిషింగ్ హార్బర్‌లకు శ్రీకారం చుట్టాం. మరో 6 ఫిష్ ల్యాండ్‌పనులు కూడా చేపట్టాం. ఈ రోజు ఫిషింగ్ హార్బర్‌లను స్కామ్‌లతో అమ్మేస్తున్నారు. ఏపీలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. ప్రభుత్వ స్కూల్ పిల్లలకు బుక్స్, యూనిఫాంలు లేవు. రాష్ట్రంలో రైతు రో÷–డడెక్కే పరిస్థితి ఉంది. ప్రజలతో బాబు చెలగాటమాడుతున్నారు' అంటూ వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ఒక్కో కుటుంబానికి 7లక్షల సాయం ప్రకటన**

మత్స్యకార కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు దీని గురించి వివరాలు తెలిపారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ.7 లక్షల చొప్పున అందిస్తామని కేకే రాజు చెప్పారు. ఈ డబ్బును వైఎస్సార్‌సీపీ తరపున అందిస్తామని అన్నారు. ప్రాణాలతో బయటపడ్డ చిన్నా కుటుంబాన్ని కూడా ఆదుకుంటామని వివరించారు. చిన్నా కుటుంబానికి రూ.7 లక్షల సాయం చేస్తామని చెప్పారు. ఇటీవల విశాఖ తీరంలో జరిగిన బోటు ప్రమాదంలో గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. అదే ప్రమాదంలో మృత్యువుతో పోరాడి ప్రాణాపాయం నుంచి బయటపడిన కారి చిన్నాను కూడా వైఎస్ జగన్ పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో
# విమానాశ్రయాలను నిర్మించండి

**మొదటిపేజీ తరువాయి**

రామ్మోహన్ నాయుడుతో సీఎం.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో వరంగల్ కీలక నగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి తెలియజేశారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంతోపాటు నల్లగొండ జిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని అన్నారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.
ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసిన కారణంగా వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు.



2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్టు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని రామ్మోహన్ నాయుడును సీఎం కోరారు. రెండు ఎయిర్‌పోర్టులకు అవసరమైన భూమిని సేకరిస్తామని సీఎం చెప్పారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలను నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రెటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ కార్యదర్శి మురళీధర్ మోహోల్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మెన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నెలవారీ ఆర్థిక నివేదిక

**మొదటిపేజీ తరువాయి**

అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌వోడీలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక విషయాలను వెల్లడించారు.ఈ సరికొత్త విధానం ద్వారా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (కేపీఐ) బెస్ట్ గవర్నెన్స్ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేస్తామని పయ్యావుల వివరించారు. దీనివల్ల రాష్ట్రంలోని వివిధ రంగాల్లో నమోదయ్యే వృద్ధి రేటును, ప్రగతిని ఎప్పటికప్పుడు రియల్ టైమ్‌లో గమనించేందుకు వీలుంటుందని చెప్పారు. ఈ విధానం వల్ల ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే గుర్తించి, మనల్ని మనం సరిదిద్దుకుని ముందుకు సాగేందుకు ఆస్కారం కలుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న 'స్వర్ణాంధ్ర-2047' విజన్‌ను సాకారం చేసుకునేందుకు ఈ నెలవారీ ఆర్థిక నివేదికలు ఎంతగానో ఉపకరిస్తాయని మంత్రి పయ్యావుల కేశవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పనితీరులో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు ఈ ప్రయత్నం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు.

# కాపు ఉద్యమ నేత ముద్రగడ కన్నుమూత

**మొదటిపేజీ తరువాయి**

ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చేరారు. అప్పటి నుంచి అక్కడ ముద్రగడకి చికిత్స జరుగుతోంది. అయితే సాయంత్రం పరిస్థితి విషమించడంతో ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రాణాలు కోల్పోయారు. ముద్రగడ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి. 1953 జనవరి 22న ఆయన జన్మించారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. తన జీవిత కాలంలో నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, ఒకసారి ఎంపీగానూ ఆయన పని చేశారు. ముఖ్యంగా కాపు ఉద్యమ నేతగా ఆయనకు మంచి గుర్తింపు లభించింది. తండ్రి మరణానంతరం 1977లో ఆయన ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జనతా పార్టీ తరఫున ప్రత్తిపాడు నుంచి విజయం సాధించారు. 1982లో తెదేపాలో చేరిన ముద్రగడ.. 1983, 1985, 1989 ఎన్నికల్లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్టీఆర్ క్యాబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. అనంతరం ఆ పదవితో పాటు తెదేపాకు రాజీనామా చేశారు. ప్రజారక్షణ సమితి, తెలుగునాడు పార్టీలను ముద్రగడ పద్మనాభం స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా గెలుపొందారు. కాపు ఉద్యమ నేతగా గుర్తింపు పొందిన ఆయన.. ఆ సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం దీక్ష చేశారు. 2016లో తునిలో కాపు ఐక్య గర్జన సభ నిర్వహించారు.

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

**మొదటిపేజీ తరువాయి**

మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు కలిసి ధన్యవాదములు తెలిపారు. 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన కేంద్రమంత్రి మన్సుక్ మాండవియను మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేసారు.

# టీటీడీ ట్రస్టులు, పథకాల దాతల ప్రివిలేజెస్‌లో కీలక మార్పులు

**మొదటిపేజీ తరువాయి**

నిబంధనలు మంగళవారం అర్ధరాత్రి నుంచే అమలులోకి వస్తాయని స్పష్టం చేశారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో జరిగిన బోర్డు సమావేశం అనంతరం ఆయన ఈవో ముద్దాడ రవిచంద్రతో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు.విరాళాల నిర్వహణలో మరింత పారదర్శకత, ఏకరూపత తీసుకురావడమే లక్ష్యమని ఆయన తెలిపారు. అయితే, ఇప్పటికే విరాళాలు సమర్పించిన పాత దాతలకు ప్రస్తుతం అమల్లో ఉన్న సౌకర్యాలు యథావిధిగా కొనసాగుతాయని ఛైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో భక్తుల సౌకర్యార్థం, ఆలయాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ధర్మప్రచారం వంటి అంశాలపై అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు.

**సమావేశంలో తీసుకున్న మరిన్ని ముఖ్యమైన నిర్ణయాలు**

భక్తుల కోసం శాశ్వత షెల్టర్లు: తిరుమలకు వచ్చే సామాన్య భక్తుల సౌకర్యార్థం, సర్వదర్శనం (ఞాణ) టోకెన్లు పొందిన వారు వేచి ఉండేందుకు శాశ్వత ఏర్పాట్లు చేయాలని బోర్డు నిర్ణయించింది. ఇందుకోసం రూ.6.31 కోట్ల వ్యయంతో ఆళ్వార్ ట్యాంక్ సమీపంలో శాశ్వత షెల్టర్లు, క్యూలైన్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి సంబంధించిన టెండర్లకు ఆమోదం తెలిపింది.డ్యామ్‌ల పటిష్టతకు చర్యలు: తిరుమలలోని కుమారధార, పసుపుధార డ్యామ్‌ల పటిష్టతకు చర్యలు చేపట్టారు. ఈ డ్యామ్‌ల వద్ద డబుల్ లేన్ వంతెన నిర్మాణానికి రూ.2.77 కోట్లు మంజూరు చేస్తూ బోర్డు ఆమోదముద్ర వేసింది.హరిత ఇంధన ప్రోత్సాహం: తిరుమలలో హరిత ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా కీలక అడుగు వేశారు. జీఎన్‌సీ సమీపంలో 800 కిలోవాట్ల సామర్థ్యం గల విండ్ టర్బైన్ జనరేటర్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. విష్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ దీన్ని విరాళంగా ఏర్పాటు చేసి, 25 సంవత్సరాల పాటు టీటీడీకి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయనుంది.అగ్నిమాపక వ్యవస్థల నిర్వహణ: భక్తుల భద్రతకు పెద్దపీట వేస్తూ తిరుమల, తిరుపతిలోని టీటీడీ ఆలయాలు, విశ్రాంతి భవనాల్లో అగ్నిమాపక వ్యవస్థల సమగ్ర నిర్వహణ కోసం రూ.2.35 కోట్లతో పనులు నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయించారు.

# ట్రంప్ యూటర్న్

**మొదటిపేజీ తరువాయి**

ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం.మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.నిజానికి సోమవారం నాడే ట్రంప్ ఈ సుంకం విధింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హర్మూజ్ జలసంధికి అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ఈ కీలక మార్గంలో భద్రత కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని తిరిగి రాబట్టేందుకే ఈ సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలసంధి భద్రత కోసం ఇటువంటి చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు.అయితే, ఈ సుంకం ప్రతిపాదనపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన విపణిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయా దేశాలు భావించాయి.
మరోవైపు, ఈ జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సహించేది లేదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, సుంకం విధింపు కంటే ఆర్థిక దౌత్యానికే మొగ్గు చూపారు.

## ఏసీబీ వలలో హెచ్ఎండీఏ ఉన్నతాధికారి..

**మొదటిపేజీ తరువాయి**

రికార్డుల ప్రకారం సుమారు రూ.9.24 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించారు.
ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం, అవినీతి నిరోధక చట్టం 1988 (2018 సవరణ)లోని సెక్షన్ 13(1)(బీ), 13(2) కింద రవీందర్‌పై కేసు నమోదైంది. ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, బినామీలకు సంబంధించిన మరో తొమ్మిది ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో దాడులు నిర్వహించారు.ఈ సోదాల్లో భారీగా స్థిరాస్తులు ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. వీటిలో కొండకల్, కిష్టాపూర్, పసమాముల గ్రామాల్లో రూ.38.89 లక్షల విలువైన ఐదు ఓపెన్ ప్లాట్లు, నార్సింగి, నానక్‌రాంగూడలో రూ.2.07 కోట్ల విలువైన నాలుగు ఫ్లాట్లు, కొండాపూర్ మసీద్ బండలో రూ.3 కోట్ల విలువైన జీ+4 భవనం, మోకిలలో రూ.1.33 కోట్ల విలువైన సెమీ-ఫినిష్డ్ విల్లా ఉన్నాయి. ఈ ఆస్తుల మార్కెట్ విలువ పత్రాల్లో చూపిన దానికంటే చాలా రెట్లు అధికంగా ఉంటుందని ఏసీబీ అంచనా వేస్తోంది.
వీటితో పాటు రూ.3.82 లక్షల నగదు, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.45.06 లక్షలు, రూ.36.7 లక్షల విలువైన 1.44 కిలోల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, నాలుగు వాహనాలు, ఇతర గృహోపకరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రవీందర్‌ను అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, మరిన్ని ఆస్తుల వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

రిపబ్లిక్

బుధవారం 15 జులై 2026

# ఆపన్న కుటుంబానికి నిత్యసురభి అండ

**నిత్యావసర సరుకులు పంపిణీ -చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి దాతృత్వం**




**అనంతపురం ప్రతినిధి, జులై 14, (రిపబ్లిక్ న్యూస్):**
ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ పేద కుటుంబానికి నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలిచింది. ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్. నిర్మలమురళి ఆధ్వర్యంలో ఉప్పరపల్లి గ్రామానికి చెందిన గంగన్న,పుల్లమ్మ దంపతులకు రెండు నెలలకు సరిపడా 40 రకాల నిత్యావసర సరుకులను మంగళవారం అందజేశారు.గంగన్న పది నెలల క్రితం చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్రంగా గాయపడి నడవలేని స్థితికి చేరుకున్నాడు. దీంతో కుటుంబ పోషణ భారం భార్య పుల్లమ్మపై పడింది. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న ఆమె పరిస్థితిని గుర్తించిన ట్రస్ట్ సభ్యులు హరినాథ్ రెడ్డి, సౌజన్య పుట్టినరోజు సందర్భంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.

**ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే మనసు ఉండాలి**
ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. నిర్మలమురళి మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేదలకు చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. గంగన్న, పుల్లమ్మ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, దాతలు ముందుకు వచ్చి వారికి సహాయం చేయాలని కోరారు. దేవుడు మనకు ప్రసాదించిన దాంట్లో కొంత భాగాన్ని ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే మనసు ప్రతి ఒక్కరిలో ఉండాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ భూమిపూజ





**శ్రీ సత్యసాయి/అనంతసాగరం,జూలై 14,(రిపబ్లిక్ న్యూస్):**
ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి మండలం అనంతసాగరం గ్రామంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి మంగళవారం భక్తిశ్రద్ధలతో భూమిపూజ నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా దేవాలయ ధర్మకర్త సాయినాథ్ కుమారుడు బోయపాటి రమణ మాట్లాడుతూ గ్రామంలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం ప్రారంభం కావడం ఆనందదాయకమన్నారు. ఆలయ నిర్మాణానికి గ్రామ ప్రజలు సహకరించి, భక్తులు కుటుంబ సమేతంగా వచ్చి స్వామివారి సేవల్లో పాల్గొని ఆశీస్సులు పొందాలని కోరారు.
దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణం గ్రామ ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు బోయపాటి రామాంజనేయులు, గ్రామ పెద్ద బోయపాటి గోపాల్, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

# అండర్-14 మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

**క్రీడలతో శారీరక, మానసిక వికాసం: కమిషనర్ జబ్బార్ మియా**



**అనంతపురం/గుత్తి, జూలై 14: ( రిపబ్లిక్ న్యూస్)**
గుత్తిలోని ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో మంగళవారం అండర్-14 బాలబాలికల మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. మున్సిపల్ కమిషనర్ బి. జబ్బార్ మియా ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. క్రీడల ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. విజేతలుగా నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించాలని కమిషనర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్రీడల శాఖ అధికారులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమం పొడిగింపు

**తాసిల్దార్ సిద్దేశ్వర రావు.**



**రైల్వే కోడూరు జూలై 14 రిపబ్లిక్ న్యూస్.**
జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సర్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని జూలై 24వ తేదీ వరకు పొడిగించినట్లు ఓబులవారిపల్లి మండల తాసిల్దార్ ఆకుల సిద్దేశ్వర రావు మంగళవారం తెలియజేశారు మండలంలోని పలు పార్టీల నాయకులు కామ్రేడ్ల, అధికారుల అభ్యర్థన మేరకు జిల్లా ఎన్నికల అధికారి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి నాయకుల అధికారుల అభ్యర్థనను తెలియజేయడం జరిగినది గ్రామాలలో ఓటర్లకు సంబంధించి ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమం మారుమూల గ్రామాలలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ లకు సంబంధించి బి ఎల్ ఏ లు బి ఎల్ వోలు లకు అప్పగించిన పని పూర్తి కాకపోవడంతో ఎన్నికల ప్రధాన అధికారి జూలై 24 వరకు పొడిగించి నిర్ణయం తీసుకోవడం జరిగిందని తాసిల్దార్ సిద్దేశ్వర రావు అన్నారు, అనంతరం తాసిల్దార్ మరియు మండల రెవెన్యూ అధికారి మల్లికార్జున రెడ్డిలు బి ఎల్ ఓ లకు, బిఎల్ఏలకు మీకు అప్పగించిన ప్రాంతాలలో పూర్తి చేయని ఇంటింటికి వెళ్లి ఓటర్లకు ఎన్యూమరేషన్ పత్రాలను అందజేసి వారికి సహకరించి జూలై 24 వ తేదీ నాటికి పూర్తి చేయాలని వారు ఆదేశించారు

# విద్యార్థుల భవిష్యత్తుతో లోకేష్ చెలగాటమాడొద్దు

**రూ.6,400 కోట్ల ఫీజు బకాయిలు విడుదల చేయాలి - హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి**

**శాపంగా మారిన జీవో నెం.77ను రద్దు చేయాలి - కలెక్టరేట్ కార్యాలయం వద్ద అర్ధనగ్న బిక్షాటన చేస్తూ ధర్నా**







**అనంతపురం కలెక్టరేట్, జూలై 14,( రిపబ్లిక్ న్యూస్):**
విద్యార్థుల భవిష్యత్తుతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెలగాటమాడుతున్నారంటూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న పేదరికంబర్స్మెంట్ 6400 కోట్ల బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఉన్నత చదువుకు శాతంగా మారిన జీవో నెంబర్ 77 రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా సమితి ఆధ్వర్యంలో ర్యాలీగా కలెక్టరేట్ కార్యాలయం వద్ద వచ్చి అర్ధనగ్న భిక్షాటన చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డి ఆర్ ఓ మలోల గారికి వినతిపత్రం అందజేశారు.

**పరిశ్రమలు వస్తే,ఉద్యోగాలు చేయడానికి సర్టిఫికెట్లు లేవు**
ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి హనుమంతు నాయుడు కుల్లాయి స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల సమస్యల పట్ల సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తోందన్నారు.రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి తెస్తుంటే ప్రభుత్వం మాత్రం ప్రేక్షక పాత్ర పోషించడం దురదృష్టకర మని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగా విద్యార్థుల చదువులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం వారి భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ అందకపోవడంతో విద్యార్థులు కోర్సు పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందక వచ్చిన ఉద్యోగాలకు వెళ్లలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది అన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలు తీసుకొస్తామని చెబుతున్న మంత్రి నారా లోకేష్ పరిశ్రమలు వస్తే దానిలో ఉద్యోగాలు చేయడానికి విద్యార్థుల దగ్గర ఈ రాష్ట్రంలో సర్టిఫికెట్లు లేవని మండిపడ్డారు.

**హాస్టల్లలో విద్యార్థులకు మౌలిక వసతులు లేక ఇబ్బందులు**
ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో విద్యార్థులు కనీస మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత, వసతి వంటి ప్రాథమిక అవసరాలను కూడా సమకూర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సంక్షేమం గురించి గొప్పలు చెప్పే ప్రభుత్వం, హాస్టళ్లలోని వాస్తవ పరిస్థితులపై వెంటనే దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు 3000 రూపాయలకు పెంచాలన్నారు కాస్మోటిక్ చార్జీలు 300 పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో అద్దె భవనాల్లో ఉంటున్న ప్రభుత్వ హాస్టల్స్ కు నిధులు కేటాయించి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు అనంతపురం నగరంలో కొన్ని సంవత్సరాలుగా దివ్యశ్రీ హాస్పిటల్ ఎదురుగా మూతబడి ఉన్న ఎస్సీ హాస్టల్ కు నిధులు కేటాయించి మరమ్మతులు చేసి ప్రారంభించాలని డిమాండ్ చేశారు.. అనంతపురం నగరం నడిబొడ్డున ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎస్సీ హాస్టల్ ను నియమించాలన్నారు. సుమారు విద్యార్థులు మూడు కిలోమీటర్ల పాటు నడుచుకుంటూ వెళ్లాల్సిన దౌర్భాగ్యమైన పరిస్థితి నెలకొందన్నారు.

**ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి**
పీజీ విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారిన జీవో నెం.77ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలి. యువగళం పాదయాత్రలో మన ప్రభుత్వ అధికారంలోకి వస్తేనే వందరోజుల్లో జీవో నెంబర్ 77 రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేటికి ఈ అంశం పైన విద్యాశాఖ మంత్రి ఏ మాత్రం కూడా మాట్లాడటం లేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు 6400కు పైగా విడుదల చేయాలన్నారు ప్రభుత్వ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఎన్నికల్లో విద్యార్థులకు ఇచ్చిన హామీలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు జిల్లా ఆఫీస్ బేరర్స్ నరసింహయాదవ్ వెంకట్ నాయక్ వంశీ మంజు చందు ఉమామహేష్ నాయకులు నవీన్ పవన్ రాజు రాజేష్ స్వామి తరుణ్ నాని బాబ్జాన్ సాయి అపాన్ సుశ్రుత్ సమీర్ జై వర్ధన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు




# రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు లక్ష్మీరెడ్డి సుడిగాలి పర్యటన

**శ్రీ సత్యసాయి/ కదిరి జూలై 14,,(రిపబ్లిక్ న్యూస్):**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ గౌరవ సభ్యుడు ఇ. లక్ష్మీరెడ్డి మంగళవారం శ్రీ సత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కదిరి పట్టణంలోని ఎం ఎల్ ఎస్ పాయింట్‌ను, తలుపుల మండలంలోని కేజీబీవీ పాఠశాల, అలాగే కదిరి ట్రైబల్ సంక్షేమం గురుకుల పాఠశాల కదిరి రూరల్ పరిధిలోని కాలసముద్రం వద్ద గల సోషల్ సంక్షేమం గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు.



**అర్హులకు నాణ్యమైన రేషన్ అందించాలి**
ఈ సందర్భంగా ఆహార కమిషన్ సభ్యులు శ్రీ ఇ. లక్ష్మీ రెడ్డి ఆయా కేంద్రాలలో అందుతున్న సేవలు, ఆహార నాణ్యతను నిశితంగా పరిశీలించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.కదిరి ఎం.ఎల్.ఎస్ పాయింట్‌ను పరిశీలించిన ఆయన, కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యం నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు. గిడ్డంగిలో నిల్వలు, పంపిణీ రికార్డులను పరిశీలించి, ఎక్కడా అవకతవకలకు తావులేకుండా అర్హులకు సరైన పరిమాణంలో, నాణ్యమైన రేషన్ అందించాలని అధికారులను ఆదేశించారు.

**విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ**
తలుపుల కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వంటశాల పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని పాఠశాల సిబ్బందికి స్పష్టం చేశారు. కాలసముద్రం వద్ద ఉన్న సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లను తనిఖీ చేసి, విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. వారికి అందుతున్న భోజన వసతులు, నిత్యావసర సరుకుల సరఫరాపై ఆరా తీశారు. వార్డెన్లు నిరంతరం అందుబాటులో ఉంటూ విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వం పేదలు, విద్యార్థుల కొరకు సరఫరా చేస్తున్న ఆహార ధాన్యాల పంపిణీలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా లక్ష్మీ రెడ్డి గారు హెచ్చరించారు. ఆహార భద్రతా చట్టం కింద లబ్ధిదారులకు అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడటం సంక్షేమ నిలయాల నిర్వాహకులు, సరఫరా అధికారుల కనీస బాధ్యతని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిఎస్ఓ వంశీ కృష్ణ రెడ్డి,సివిల్ సప్లైస్ డిఎం రాజు నాయక.బిసి సంక్షేమ అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి,గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రామ్ ఇతర హాస్టల్ వార్డెన్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శకునాల స్కూల్ పీపుల్ లీడర్ గా జెపి ఘనవిజయం

**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 14 (రిపబ్లిక్ న్యూస్)**
ఓర్వకల్లు మండల పరిధిలోని శకునాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతన ఎస్ పి ఎల్ (స్కూల్ పీపుల్ లీడర్) గా తొమ్మిదవ తరగతి చెందిన జయప్రకాష్ అత్యధిక మెజారిటీ సాధించి ఘనవిజయం సాదించారు. తన సమీప ప్రత్యర్థి కె. స్వాతిను 95 ఓట్ల మెజారిటీతో ఓడించి ఎస్ పి ఎల్ గా గెలుపొందారు. కాగా స్వాతి ఏ ఎస్ పి ఎల్ గా కొనసాగుతారని పాఠశాల ప్రధానోపాధ్యాయుని కమతం సునీత తెలిపారు ఎస్పిఎల్ ఎన్నిక కొరకు ఉదయం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా మొత్తం 12 నామినేషన్లు నమోదు కాగా మధ్యాహ్నం ఓటింగ్ సమయానికి ముందు నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా బరిలో 8 మంది



మిగిలారు. భారత ఎన్నికల కమిషన్ రూల్స్ ను పాటిస్తూ సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నికను సజావుగా నిర్వహించారు. అంతకు ముందు అభ్యర్థులు తమకు ఓటు వేయాల్సిందిగా తరగతి గదిల లోని విద్యార్థులను తమదైన శైలిలో అభ్యర్థిస్తూ ఆకట్టుకున్నారు. మొత్తం 242 మంది విద్యార్థులు తమ ఓటును హక్కు వినియోగించుకున్నారు. ఇందులో రెండు ఓట్లు చల్లనివిగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాగా జయప్రకాష్ కు మొత్తం 125 ఓట్లు రాగ మిగతా ఏడు మంది అభ్యర్థులు 115 ఓట్ల కే పరిమితం కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుని కమతం సునీత జయప్రకాష్ కు గెలుపొందినట్లు డిక్లరేషన్ ఫామ్ అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. తన మీద నమ్మకం ఉంచి ఎస్పిఎల్ కి గెలిపించిన సహా విద్యార్థులను నూతన ఎస్ పి ఎల్ జయ ప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించిన ఉపాధ్యాయ బృందాన్ని కమతం సునీత ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు నూతన ఎస్ పి ఎల్ బుధవారం నుండి బాధ్యతలు స్వీకరిస్తారని ఆమె తెలిపారు

# రైతు సంస్కృతికి ప్రతీకగా మంటెద్దుల వేడుకలు

## ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ - వ్యవస్థాపక అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య





**అనంతపురం సంక్షేమం, జూలై 14,(రిపబ్లిక్ న్యూస్):** మన భారతీయ సంస్కృతిలో పశువులకు ప్రత్యేకమైన స్థానం ఉందని ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య అన్నారు.రైతుకు వ్యవసాయ పనుల్లో తోడుగా ఉండే ఎద్దులను గౌరవిస్తూ వాటికి కృతజ్ఞతలు తెలియజేసే పండుగే "మంటెద్దుల పండుగ" అని ఆమె తెలిపారు. ఇటువంటి పండుగలను ఆచరిస్తే రాబోవు తరానికి మన సంస్కృతిని అందించిన వారమవుతామని అన్నారు.ఈ పండుగ సందర్భంగా మట్టితో ఎద్దుల రూపాలను తయారు చేస్తారు. వాటిని పసుపు, కుంకుమ, పూలతో అందంగా అలంకరించి పూజిస్తారు. దీపాలు వెలిగించి నైవేద్యం సమర్పిస్తారు. ఈ ఆచారం ద్వారా పశువుల పట్ల ప్రేమ, గౌరవం మరియు మన పూర్వీకుల సంప్రదాయాలను గుర్తు చేసుకుంటామని చెప్పారు.

**ప్రకృతిని, పశువులను గౌరవించడం మన బాధ్యత**

దాససాహితి ప్రాజెక్ట్ వంటి సంస్థలు ఈ పండుగను సాంస్కృతిక కార్యక్రమాలతో నిర్వహిస్తూ, పిల్లలకు మరియు యువతకు మన సంప్రదాయాలు, కళలు, భక్తి భావాలను పరిచయం చేస్తున్నాయి. మట్టి ఎద్దుల తయారీ ద్వారా గ్రామీణ కళాకారుల నైపుణ్యాన్ని కూడా ప్రోత్సహిస్తున్నామని గుంతకల్లు విజయమ్మ తెలిపారు.మంటెద్దుల పండుగ మన సంస్కృతికి ప్రతీక. ప్రకృతిని, పశువులను గౌరవించడం మన బాధ్యత అని ఈ పండుగ మనకు తెలియజేస్తుందని దేవరకొండ కౌసల్య అన్నారు.

ఈ కార్యక్రమంలో పిల్లలు చక్కగా అలంకరించుకొని పాటలు పాడి, కోలాటం, కూచిపూడి నృత్యాలు చేశారు. ఇందులో లిసమృద్ధి, దీపిక, హర్షిణి, రమా, శైలజ, కవిత, శిరీష, భార్గవి, లక్ష్మీ, రాగిణి, అర్చన, ఆనందమ్మ, రాజేశ్వరి, శాంతి, రిషికా, లతికా, రిషిత శ్రీ, పద్మ, దార్విక, కృషికి, సాధన, శ్రీ లౌక్య, జ్ఞానసంహిత, భావరామ్ , ఈశ్వరి లతికాతది తరులు పాల్గొన్నారు.

# ఈనెల ఆఖరిలోపు పంటల భీమా చేసుకునే అవకాశం

## ఏఓ పవన్ కుమార్




**బండి ఆత్మకూరు, జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):-** రైతులు ఖరీఫ్ సీజన్లో సాగుచేసిన పంటలకు పంటల బీమా నమోదు చేసుకుని అవకాశం ఈనెల ఆఖరి వరకు ఉందని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సూచించారు. మంగళవారంబండి ఆత్మకూరు మండలం కడమలకాలువ, వెంగలరెడ్డిపేట గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వ్యవసాయ అధికారి రైతులకు పలు కీలక సూచనలు చేశారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో రైతులు పంట బీమా చేసుకోవడానికి జులై 31 వ తారీకు వరకు గడువు ఉందన్నారు. రుణాలు పొందిన రైతులు బ్యాంకులో ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. రుణం తీసుకొని రైతులు సిఎస్ సి సెంటర్ లో పంట బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏక పంట విధానానికి రైతులు స్వస్తి చెప్పాలన్నారు. బహుళ పంటలు సాగు చేయడం వల్ల దిగుబడులు పెరిగి రైతులు అధిక లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు. వరి పంట సాగులో సూడోమోనస్ ,బయోఫస్టిసైడ్ పిచికారి చేసుకోవాలనీ తెలిపారు. దీనివల్ల పైరుకు నేల నుంచి సంక్రమించే తెగుళ్లు 20 నుంచి 30 రోజుల పాటు తగ్గించుకోవచ్చునని వివరించారు. వరి నాటు వేసేటప్పుడు నారు కొనలు తుంచి నాటుకోవడం వలన కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చునన్నారు. అంతే కాకుండా పిలకలు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల వైస్ ఎంపీపీ రాగల రమణ, వ్యవసాయ విస్తరణ సిబ్బంది సక్రు నాయక్, వీఆర్వో వెంకటేశ్వర్లు, పంచాయతీ సెక్రెటరీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

# పంచాయతీ రాజ్ అవార్డులపై కూటమి ప్రభుత్వం క్రెడిట్ చోరీ చేస్తోంది.

## వైస్సార్సీపీ పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు కసాపురం తిక్కస్వామి



**అనంతపురం / గుంతకల్ జులై 14 (రిపబ్లిక్ న్యూస్ )** ఈరోజు వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు సమన్వయకర్త వై.వెంకటరామి రెడ్డి గారి ఆదేశాలు మేరకు వైస్సార్సీపీ గుంతకల్లు నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు కసాపురం తిక్కస్వామి గారు పత్రిక ప్రకటన చేయటం జరిగింది.ఈ సందర్భంగా కసాపురం తిక్కస్వామి మాట్లాడుతూ....ఆంధ్రప్రదేశ్‌కు పంచాయతీ రాజ్ విభాగంలో వచ్చిన ఐదు జాతీయ అవార్డులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి పాలనలో గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన, పంచాయతీల బలోపేతానికి చేపట్టిన సంస్కరణల ఫలితమే అన్నారు.

2023, 2024 సంవత్సరాల్లో రాష్ట్ర పంచాయతీ రాజ్ వ్యవస్థ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది.గ్రామ సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థ,గ్రామ స్థాయిలో అభివృద్ధి కార్యక్రమాలు,పారదర్శక నిధుల వినియోగం వంటి అంశాలే ఈ అవార్డులకు ప్రధాన కారణం అన్నారు.అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు గారు ,పవన్ కళ్యాణ్ గారు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వాస్తవాలను ప్రజల నుంచి దాచిపెట్టి,జగన్ గారి హయాంలో వచ్చిన అవార్డులను తమ ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకోవడం దారుణమైన క్రెడిట్ చోరీ అని తెలిపారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయ ప్రచారం తప్ప మరొకటి కాదు అన్నారు.అభివృద్ధి చేసిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైస్ జగన్ గారికి గుర్తింపు ఇవ్వకుండా, ఇతరుల కృషిని తమ విజయంగా చెప్పుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అన్నారు. వాస్తవాలను వక్రీకరించి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను వైఎస్సార్సీపీ పంచాయతీ రాజ్ విభాగం తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు.

ప్రజలు నిజాలను గుర్తించాలని,జగన్ గారి పాలనలో జరిగిన అభివృద్ధిని ఎవరూ చెరిపివేయలేరని, చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చంద్రబాబు గారు కూటమి ప్రభుత్వం ఎంత చేసినా సత్యం ప్రజల ముందుకు వస్తుందని అన్నారు.జగన్ గారు చేసిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు చంద్రబాబు గారు క్రెడిట్ చోరీ చేస్తున్నారని,క్రెడిట్ చోరీ చేయటంలో చంద్రబాబు గారికి సాటి ఎవరు రారుని,ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలు ప్రజలు గమనిస్తున్నారాని రాబోయే రోజుల్లో ప్రజలు కచ్చితంగా బుద్ధి చోబుతారు తెలిపారు

# గోమాత చుట్టూ ప్రదక్షిణలు చేస్తే భూమండలం చుట్టూ వచ్చినంత ఫలితం

## దేశంలోగోమాతను జాతీయ ప్రణయ ప్రకటించాలి -సపారేగోవిందరాజులు సంకల్ప దీక్ష



**కల్లూరు ప్రతినిధి, జులై 14(రిపబ్లిక్ న్యూస్)** దేశంలోగోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలి,గోమాత చుట్టూ ప్రదక్షిణ చేస్తే భూ మండలం చుట్టూ వచ్చినంత ఫలితం దక్కుతుందని దాసరి రామచంద్రారెడ్డి గోశాల అధ్యక్షులు సూచించారు. కల్లూరు రామిరెడ్డి తాత గోశాల ప్రాంగణంలో దాసరి రామచంద్రారెడ్డి గోశాల అధ్యక్షులుచేపట్టిన సంకల్ప దీక్ష గోడపత్రికను విడుదల చేశారు. ఇటీవల గో సంరక్షణలో భాగంగా సంకల్ప దీక్ష చేపట్టిన సపారే గోవిందరాజుకు తన సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా దాసరి రామచంద్రారెడ్డి. గోశాల అధ్యక్షులు. చెట్లం రామచంద్ర రావు. భరత్ శర్మ. మల్లికా. సఫారీ గోవిందరాజులు మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మం ప్రకారం కొన్ని యుగాల నుండి మన పూర్వీకులు గో మాతకిచ్చిన విలువ అమూల్యం అఖండమైనదని అన్నారు. గోమాత నుండి లభించే పాలు శివుడికి అభిషేకిస్తాం, పెరుగు, నెయ్యి పంచామృతం లోనూ వినియోగించడం జరుగుతుందన్నారు. ఇదంతా కూడా భగవంతుడి సంకల్పం కూడినది అన్నారు. రాజుల కాలంలో 10 వేల గోవులు ఉన్నాయంటే వారికి ప్రత్యేక గుర్తింపు ఉండేదని ఆయన గుర్తు చేశారు. నేడు రోడ్డుపై వెళుతున్న గోమాతను విస్మరించడం, కనీసం కన్నెత్తి చూడకుండా వెళ్లడం బాధాకర మన్నారు. మన పూర్వీకులు సేంద్రియ సంకల్పంలో భాగంగా పంట పొలాలను దున్ని.. వాటికి వినియోగించే సేంద్రియ ఎరువుల ద్వారా పంట ఉత్పత్తులు సాధించి వాటిని ఆహారంగా తీసుకోవడం వల్ల వారి ఆయుస్సు 100 ఏళ్లకు పైగా ఉండేది అన్నారు. ప్రస్తుతం రసాయన ఎరువులు వాడకంతో గతంలో మనం ఎన్నడు లేని విధంగా భూ మండలం కాలుష్య కూరల్లో చిక్కుకొని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మనిషికి ఎన్నడూ లేనటువంటి ఆరోగ్య సమస్యలు పట్టిపీడిస్తున్నాయన్నారుచివరకు మనిషి ఏమి తింటున్నాడో తెలియని దుస్థితి నెలకొందని ఉందన్నారు.

ప్రతి ఒక్క హిందూ కుటుంబం కనీసం అమావాస్య పున్నమి రోజుల్లో అయినా కుటుంబ సభ్యులతో కలిసి గోసేవకు కొంత సమయం కేటాయించాలని కనీసం గ్రాసం అందిస్తే లభించే పుణ్యఫలాలు అమోఘం అన్నారు. గోవిందరాజు చేపట్టిన సంకల్ప దీక్షకు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించే వరకు పార్టీలకు అతీతంగా కలసికట్టుగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం దాసరి రామచంద్ర రెడ్డి గోశాల అధ్యక్షులు. సేట్లమ్ రామారావు గోశాల అధ్యక్షుడు. భరత్ శర్మను.గోవిందరాజు ఘనంగా సత్కరించి సన్మానించారు. అలాగే గోశాలలో ఉన్న గోవులకు మేత అరటి పండ్లు పూజా కార్యక్రమాలను చేశారు. ఇందులో పాల్గొన్న. దాసరి రామచంద్రారెడ్డి గోశాల అధ్యక్షుడు. సెట్ ట్లం రామారావు గోశాల అధ్యక్షులు. భరత్ శర్మ. మల్లికా. లక్ష్మి. సఫారీ గోవిందరాజులు పాల్గొన్నారు

# స్వచ్ఛంద రథం ఆపరేటర్లకు రాష్ట్ర స్థాయి సత్కారం





**పశ్చిమ గోదావరి/తాడేపల్లిగూడెం, జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):** స్వచ్ఛ ఆంధ్రస్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో విశేష సేవలు అందించిన స్వచ్ఛంద రథం ఆపరేటర్లను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఘనంగా సత్కరించింది. తాడేపల్లిగూడెంలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన ఆపరేటర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు.రాష్ట్ర కమిషనర్ కృష్ణతేజ (ఐఏఎస్) చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్న వారిలో అనంతపురం జిల్లా తాడిపత్రి మండలానికి చెందిన స్వచ్ఛ రథం ఆపరేటర్ రామకేశవ, శ్రీ సత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలానికి చెందిన 'సత్య రథం' ఆపరేటర్ బాబా ఫక్రుద్దీన్ ఉన్నారు.

**ప్లాస్టిక్ రహిత గ్రామాల నిర్మాణానికి రామకేశవ చేస్తున్న కృషి**

తాడిపత్రి మండలంలోని గ్రామపంచాయతీల్లో ప్రతిరోజూ పొడి చెత్తను సేకరించి, దానికి బదులుగా ప్రజలకు నిత్యావసర వస్తువులు అందించడం ద్వారా ప్లాస్టిక్ రహిత గ్రామాల నిర్మాణానికి రామకేశవ చేస్తున్న కృషిని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ సందర్భంగా కమిషనర్ కృష్ణతేజ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ గ్రామాల నిర్మాణంలో స్వచ్ఛంద రథం ఆపరేటర్ల పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా పరిషత్ సీఈఓ విజయలక్ష్మి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పంట వేసుకున్న ప్రతి రైతు క్రాప్ ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోండి

## అగ్రికల్చర్ ఏవో శ్రీరామ్ ప్రవీణ్






**చిప్పగిరి, జూలై, 14,( రిపబ్లిక్ న్యూస్)** పంట వేసుకున్న ప్రతి రైతు క్రాప్ ఇన్సూరెన్స్ తప్పకుండా చేసుకోవాలని అగ్రికల్చర్ ఏవో శ్రీరామ్ ప్రవీణ్ కోరారు, మంగళవారం చిప్పగిరి, నంచర్ల, గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ప్రతి, వేరుశనగ కు చివరి తేదీ జూలై 15 వరకు అని, ప్రతి ఎకరానికి 2 వేలు, వేరుశనగ కు 500 రూపాయలు ఎకరాకు చెల్లించాలని, పీఎం ఫసల్ బీమా యోజన కింద వరి మొక్కజొన్న, కంది, జొన్న, ఆముదం, మిరప, సజ్జ, కొర్ర ,లకు జూలై ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉన్నదని, పంట రుణం పొందని రైతులు స్వీయ దృవీకరణ పత్రమును ఇచ్చి మీసేవ సెంటర్ ద్వారా నమోదు చేసుకోవచ్చని, అదేవిధంగా రైతులు తమ పంట వివరాలు తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు సంబంధిత ఆర్ఎస్కే సిబ్బంది సంప్రదించి పంట నమోదు చేసుకోవచ్చని, ఇంకా కొంతమంది రైతులు రైతు గుర్తింపు నమోదు చేసుకోలేదని, పంట భూమి ప్రతి రైతు రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని, వర్షాలు లేనందున చాలామంది ఇంకా పంటలు వేసుకోలేదని వర్షం కోసం వేచి చూస్తున్నారని ఎలినివో ప్రభావం ఉన్నందున రైతులు స్వల్ప కాలవ్యవధి గల చిరుధాన్యాలు రాగులు, కొర్రలు, సజ్జలు మొదలగు పంటలు వేసుకోవాలని అదేవిధంగా ఏక పంట విధానానికి స్వస్తి పలికి పలు పంటలు విధానానికి రైతులు మారాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఏఈఓ రమాదేవి, ఆర్ఎస్కే సిబ్బంది, ఏపీ సి ఎన్ఎఫ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎక్స్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు గుజిరి కాజా.



**అనంతపురం/గుంతకల్ జూలై 14 ( రిపబ్లిక్ న్యూస్)** గుంతకల్ పట్టణం నందు గల 22వ వార్డు నందు ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో పాల్గొన్న ఎక్స్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు గుజిరి కాజా పాల్గొన్నారు అనంతరం గుజిరి కాజా మాట్లాడుతూ గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆదేశాల మేరకు మరియు గుంతకల్ ఇన్చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి ఆదేశాల మేరకు ఈరోజు 22వ వార్డు లో గల 59 మరియు 60 పోలింగ్ బూత్ లో నందు గల ఎస్ ఐ ఆర్ ప్రోగ్రాం భాగంగా ఈదురు బి ఎల్ ఓ ఎక్స్ జిల్లా మైనారిటీ అధ్యక్షుడు గుజరి కాజా ఆధ్వర్యంలో నిర్వహించారు వార్డు ప్రజల్లో నందుగల సూచనలు కొన్ని సెంటర్ ఓటర్లు ఫోరం లు 6/7/8 వార్డులో ని ప్రజలకు ఇవ్వడం జరిగింది వారితోపాటు 22వ వార్డ్ ప్రజలు కు తెలియజేశారు అలాగే ఆర్డీవో, ఎమ్మార్వో, మున్సిపల్ ఆఫీస్ కార్యాలయంలో కూడా పర్యవేక్షించినారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు గుజరికాజా మరియు కొలిమి రామాంజనేయులు, వలి భాష కే రఫీ మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముద్రగడ మృతికి అనంత సంతాపం

**అనంతపురం క్రైమ్, జూలై 14 (రిపబ్లిక్ న్యూస్):** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతిపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ముద్రగడ మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే, ఎంపీగా ప్రజాసేవ చేసి, మంత్రిగా తనదైన ముద్ర వేసుకున్న నాయకుడిగా ఆయనను గుర్తు చేశారు. కాపు రిజర్వేషన్ల సాధన కోసం నిరంతరం పోరాడిన ఉద్యమనేతగా ముద్రగడకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.కాపు సామాజిక వర్గంతో పాటు అన్ని వర్గాల ప్రజల్లో ఆయనకు విశేష ఆదరణ ఉందని తెలిపారు. ఆయన మరణంతో ప్రజా ఉద్యమాలకు అంకితమైన ఒక నాయకుడిని రాష్ట్రం కోల్పోయిందన్నారు. ముద్రగడ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు.


ముద్రగడ పద్మనాభం

# అబద్ధాల పునాదులపై పుట్టిందే గొడ్డలి పార్టీ

**-రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల భోజమ్మ....**

- మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కు లేదు
- వైసీపీ హయాంలో 277 మంది మత్స్యకారులు మృతిచెందినా ఒక్కరిని కూడా పరామర్శించలేదు
- రూ.10 లక్షల సాయాన్ని 'ముష్టి' అనడం జగన్ అవినీతి మనస్తత్వానికి నిదర్శనం
- 10 నాటికల్ మైల్స్‌ను 10 కిలోమీటర్లుగా చెప్పడం జగన్ అజ్ఞానానికి ప్రతీక
- అభివృద్ధిపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు సిద్ధం



**దేవనకొండ జూలై 14 (ప్రజా రిపబ్లిక్ న్యూస్):-**
అబద్ధాలు, అసత్య ప్రచారంతో రాజకీయాలు చేసే పార్టీ వైసీపీ అని, అలాంటి పార్టీ అధ్యక్షుడు జగన్‌రెడ్డికి మత్స్యకారుల సంక్షేమంపై మాట్లాడే నైతిక హక్కు లేదని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల భోజమ్మ అన్నారు.... విశాఖ పర్యటనను జగన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నారని విమర్శించారు.... బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన జగన్‌రెడ్డి మరోసారి నిరాశపరిచారని పేర్కొన్నారు....విశాఖ సముద్రంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా ఆరుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటన బాధాకరమని తెలిపారు. అయితే సమాచారం అందిన వెంటనే ప్రభుత్వం యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి సహాయక చర్యలు ప్రారంభించిందన్నారు....అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేశాయని వివరించారు... మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి బైక్ ఢీకొని గొర్రెల కాపరి దానయ్య మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా రాజకీయ విమర్శలకే పరిమితమయ్యారని అన్నారు...విశాఖ తీరంలో ప్రమాదం జరిగిన ప్రదేశం 10 నాటికల్ మైల్స్ దూరంలో ఉండగా, దానిని 10 కిలోమీటర్లలోపే జరిగిందని జగన్‌రెడ్డి చెప్పడం ఆయనకు ప్రాథమిక అవగాహన కూడా లేదనే విషయాన్ని బయటపెడుతోందన్నారు.... నాటికల్ మైల్స్, కిలోమీటర్ల మధ్య తేడా తెలియకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా సముద్రంలో వేటకు వెళ్లిన 277 మంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయినా, అప్పటి ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒక్క కుటుంబాన్ని కూడా పరామర్శించలేదని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి ఇప్పుడు మత్స్యకారులపై ప్రేమ చూపించడం రాజకీయ నాటకమేనని విమర్శించారు.... విశాఖ ఘటనలో బాధితుల ఆచూకీపై స్పష్టత రాకముందే కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించిన ప్రభుత్వం మానవత్వంతో వ్యవహరించిందన్నారు... ఆ సహాయాన్ని కూడా 'ముష్టి'గా అభివర్ణించడం ప్రజల బాధలను అవమానించడమేనని పేర్కొన్నారు...
ప్రతి మత్స్యకార పడవకు ట్రాన్స్‌పాండర్లు అమర్చి, అత్యవసర పరిస్థితుల్లో అలారం బటన్ నొక్కగానే ప్రభుత్వానికి సమాచారం చేరే విధంగా ఆధునిక వ్యవస్థను అమలు చేశామని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల భోజమ్మ తెలిపారు. ప్రమాదం జరిగే సమయంలో పడవలో ఉన్న వ్యక్తులు ట్రాన్స్‌పాండర్ స్విచ్ నొక్కకపోవడం వలన ఆచూకి లభించలేదని తెలిపారు... మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి కప్పట్రాల భోజమ్మ తెలిపారు....గత ప్రభుత్వం ఐదేళ్లలో మత్స్యకార భరోసా పథకం కింద రూ.531 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, కూటమి ప్రభుత్వం రెండేళ్లలోనే రూ.511 కోట్లు మత్స్యకారులకు అందచేసామని వెల్లడించారు.... పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించడంతో పాటు కొత్త బోట్లు, వలలు, తెప్పల పంపిణీ కార్యక్రమాలను పునఃప్రారంభించామని వెల్లడించారు...
మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడికి సంబంధించిన రోడ్డు ప్రమాదం కేసులో వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం జరిగినప్పటికీ, సీసీ కెమెరా దృశ్యాలతో నిజాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ప్రమాదాలు ఆకస్మాత్తుగా జరుగుతాయి, కానీ ప్రమాదం జరిగిన వెంటనే బాధితున్ని వెంటనే హాస్పిటల్ కు తరలించకుండా, తన కొడుకును కాపాడుకునేందుకు వేరే వ్యక్తి యాక్సిడెంట్ చేసేనట్లు చిత్రికరించేందుకు ప్రయత్నం చేసిన మాజీ మంత్రి కుటీల మనస్తత్వం ఏంటో బయటపడిందని అన్నారు. సమయానికి బాధితున్ని హాస్పిటల్ కు తరలించి ఉంటే అతను బ్రతికే అవకాశం ఉండేదని, చట్టం ముందు ఎవరూ అతీతులు కాదని, ఈ వ్యవహారంలోనూ న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిపై జగన్‌రెడ్డితో ఎప్పుడైనా బహిరంగ చర్చకు సిద్ధమని కప్పట్రాల భోజమ్మ సవాల్ విసిరారు. ప్రత్యక్షంగా అయినా, ఆన్‌లైన్‌లో అయినా ప్రజల ముందే వాస్తవాలు వెల్లడించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. అసత్య ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు ఇక ఫలించవని, ప్రజలు ఇప్పటికే వైసీపీ నిజస్వరూపాన్ని గుర్తించారని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాల భోజమ్మ పేర్కొన్నారు....

# పంటల భీమా గడువు పొడిగించాలి

**- గుంతకల్ నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు బాబు రావ్ యాదవ్ డిమాండ్.**



**అనంతపురం /గుంతకల్ జూలై 14 (రిపబ్లిక్ న్యూస్ )**
గుంతకల్ పట్టణం నందు గల వైసిపి రైతు విభాగం అధ్యక్షుడు బాబురావు యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుతం నియోజకవర్గం వ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం లోటు నమోదు కావటంతో ఇంకా పూర్తి స్థాయిలో పంటల సాగు చేయలేదని ఇలాంటి పరిస్థితులలో భీమా గడువు రేపటి ముగియటం రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుంది అని పేర్కొన్నారు..గత జగన్ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల భీమా పథకాన్ని రద్దు చేయటం వలన రైతులు ఇప్పటికే, నష్టపోయారని ఇప్పుడు స్వచ్ఛందంగా భీమా ప్రీమియం చెల్లించాలని చెప్పటం రైతులపై అదనపు భారం అవుతుందని విమర్శించారు..అందువలన భీమ గడువు పొడిగించటం అత్యవసరం అని,ప్రీమియం ను ఈ నెల జులై 31 వరకు పొడిగించి రైతులకు రక్షణ కల్పించాలని సంబందించిన జిల్లా అధికారులను కోరటం జరిగింది..అలాగే పీఎం కిసాన్ నిధుల ఇంత వరకు రైతులకు జమ కాలేదు.. వారి గురించి ఎంపీ అంబికా లక్షినారాయణ చొరవ తీసుకుని తక్షణమే రైతులకు న్యాయం చేయాలనీ కోరటం జరిగింది.గత నెల 20 వ తేదిన విడుదల చేసిన నిధులు ఎక్కడ పోయాయో తెలియటం లేదని.. సంబందించిన అధికారులను అడిగితే మాకు తెలియదు అని సమాధానం చెప్పటం ఎంతవరకు సహజం అని, ఈ కూటమి ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలని కూటమి ప్రభుత్వాన్ని విమర్శించటం జరిగింది.. ఈ కార్యక్రమంలో వైసిపి రైతు విభాగం అధ్యక్షుడు బాబురావు యాదవ్ తో పాటు రైతులు మరియు వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోయకొండపై అలరించిన చండీ హోమం



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 14 రిపబ్లిక్ న్యూస్** శక్తి క్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహించిన చండీ హోమం భక్తులను అలవించింది. ప్రతినెల అమావాస్య రోజున జరిగే ఈ హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు ఆలయ ఈవో ఉప కమిషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో వేద పండితులు గోవర్ధన శర్మచే చండీ హోమాన్ని నిర్వహించారు. ఆలయంలోని మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పవిత్ర తీర్థప్రసాదాలు అందుకున్నారు.

# భక్తులతో పోటెత్తిన శ్రీ ఏకశిలా అభయాంజనేయ స్వామి

**వేలాదిగా తరలివచ్చిన భక్తులు**

**జై హనుమాన్, జైశ్రీరామ్ అంటూ నినాదాలతో హోరెత్తించిన భక్తులు**





**బండి ఆత్మకూరు, జూలై 14, (రిపబ్లిక్ న్యూస్ ):-** బండి ఆత్మకూరు మండలం, పెద్దదేవరాపురం గ్రామ శివారులో వెలసిన ప్రసిద్ధిగాంచిన శ్రీ ఏకశిలా అభయాంజనేయ స్వామి ఆలయం భక్తులతో పోటెత్తింది. మంగళవారం అమావాస్య పర్వదినం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకొని అక్కడ అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. స్వామివారికి ప్రదక్షణలు చేసి జై హనుమాన్, జైశ్రీరామ్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కాయా కర్పూరాలు సమర్పించి వారి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిధిలో భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహకులు శివరాజు నాయక్ వసతి సదుపాయాలు కల్పించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అలాగే భక్తుల కాలక్షేపం కోసం సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. అయితే అర్ధరాత్రి దాటిన తర్వాత స్వామివారికి సమర్పించే ప్రత్యేక మంగళ హారతి ఇక్కడ ప్రత్యేకం. ఇందుకోసం భక్తులు జాగారం చేస్తూ వేచి ఉన్నారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో అభయాంజనేయ స్వామి ఆలయం ప్రాంతం పండుగ వాతావరణం నెలకొంది.



# తిరుపతి తెలుగుదేశం సమావేశంలో విలేకరులపై దాడి చేసిన వారిని శిక్షించాలి: ఏపీడబ్ల్యూజేఎఫ్



**చౌడేపల్లి ప్రతినిధి జూలై 14 రిపబ్లిక్ న్యూస్**
ధార్మిక క్షేత్రం తిరుపతిలో ఈనెల 13న ఓ ప్రైవేటు హోటల్ నందు తెలుగుదేశం పార్టీ సమావేశంలో విలేకరులపై దాడి చేసినందుకు స్థానిక పత్రిక విలేకరులు నిరసన వ్యక్తం చేశారు ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా వినతి పత్రాన్ని అందించారు దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు రాజ్యాంగంలో నాలుగవ స్తంభంగా ఉన్న విలేకరుల దాడి అప్రజా స్వామికి మన్నారు పాత్రికేయులను కొట్టి కెమెరాలు ధ్వంసం చేసిన వారిపై చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్హెచ్ఓ కు వినతి పత్రాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక పాత్రికేయులు నాగరాజా, సుధీర్ ,శ్రీనివాసులు మురళీమోహన్,లీలా కుమార్ నాగ్, రమేష్, కూరపర్తి శ్రీనివాసులు రామారావు,దేవేంద్ర ,లక్ష్మి కుమార్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.




# విద్యను వ్యాపారంగా మార్చిన జగిత్యాల జిల్లా ప్రైవేట్ పాఠశాల యజమాన్యాలు

**అని ఆరోపించిన జగిత్యాల జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి**

**రాయికల్ పట్టణం జూలై,14 ( రిపబ్లిక్ న్యూస్)**
విద్యను పలువురు ఆర్థిక ఇబ్బందులతో ప్రైవేట్ పాఠశాలలో చదివించలేని తల్లిదండ్రులు తమ పిల్లలను మధ్యలోనే విద్యను సదుపించలేకపోతున్నారని ఆలా ఎంతో మంది ఉన్నారని వారి కొరకైనా ఫీజులు తగ్గించాలని ప్రభుత్వమే ఫీజులు ప్రకటించాలని జగిత్యాల జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు మరియు తల్లిదండ్రులపై జరుగుతున్న అక్రమాలు, అధిక ఫీజుల వసూళ్లు, కనీస విద్యా ప్రమాణాల ఉల్లంఘనపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్కు రాయికల్ మండల విద్యాధికారికి వినతి పత్రం సమర్పించిన మానవ హక్కుల పరిరక్షణ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి
జగిత్యాల జిల్లాలోని అనేక ప్రైవేట్ పాఠశాలల్లో విద్యా హక్కు చట్టం మరియు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనేక అక్రమాలు జరుగుతున్నాయని ప్రజల నుండి వరుసగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ పరిస్థితి విద్యార్థుల భవిష్యత్తుతో పాటు తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితిపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.
ప్రధానంగా విద్యార్థులకు గాలి, వెలుతురు, తగిన విస్తీర్ణం వంటి కనీస సౌకర్యాలు లేని తరగతి గదుల్లో విద్యార్థులకు బోధన నిర్వహించడం.ఒకే తరగతికి చెందిన విద్యార్థుల నుండి ఒకే విధమైన ఫీజు వసూలు చేయకుండా, వ్యక్తుల






సామాజిక లేదా ఆర్థిక స్థితిని బట్టి వేర్వేరు ఫీజులు నిర్ణయించడం.
పాఠశాలలలోనే యూనిఫాంలు, టైలు, బెల్టులు, పుస్తకాలు మొదలైన వాటిని అధిక ధరలకు తప్పనిసరిగా కొనుగోలు చేయించే విధానం.తగిన విద్యార్హతలు బీఈడీ టెట్లో పాసైన లేని ఉపాధ్యాయులతో బోధన నిర్వహించడం,.
తక్కువ జీతాలతో ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్య అందించడంలో నిర్లక్ష్యం చేయడం.
"1+1", "ఇద్దరు పిల్లలను చేర్పిస్తే మూడో పిల్లవారికి ఉచిత ప్రవేశం" వంటి ఆఫర్ల ద్వారా విద్యను వ్యాపారంగా మార్చడం.
విద్యా సంవత్సరం మధ్యలో టూర్లు, ప్రత్యేక కార్యక్రమాలు మొదలైన పేర్లతో అదనపు డబ్బులు వసూలు చేయడం.
ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా పాఠశాలలలోనే పుస్తకాలు మరియు ఇతర విద్యా సామగ్రిని తప్పనిసరిగా విక్రయించడం.
పై అంశాలు విద్యా వ్యవస్థను పూర్తిగా వ్యాపార ధోరణిలోకి నెట్టివేస్తున్నాయి. విద్య అనేది సేవగా ఉండాల్సిన చోట వ్యాపారంగా మారడం అత్యంత ఆందోళనకరమైన విషయం. ఈ పరిస్థితిపై జిల్లా స్థాయి ప్రత్యేక కమిటీతో సమగ్ర విచారణ జరిపించి, నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని మనవి చేస్తున్నాను.
మానవ హక్కుల జిల్లా అధ్యక్షునిగా, విద్యార్థుల హక్కులు, తల్లిదండ్రుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఈ ఫిర్యాదు సమర్పిస్తున్నాను. ప్రజల ఆందోళనను దృష్టిలో ఉంచుకొని తక్షణమే చర్యలు చేపట్టవలసిందిగా
మానవ హక్కుల పరిరక్షణ సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఆడెపు రాజమౌళి కోరారు

# భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన




**చౌడేపల్లి ప్రతినిధి జూలై 14 రిపబ్లిక్ న్యూస్**
భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయుడు సి ఉమా శంకర్ రెడ్డి ప్రసంగిస్తూ భూసార పరీక్షలు చేసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు ఈ పరీక్షల వల్ల నేల స్వభావం తెలుస్తుందని ఎలాంటి పంటలు వేయాలో అధికారులను అడిగి తెలుసుకోవచ్చునని అన్నారు సాధారణ పరిస్థితుల కంటే భూసార పరీక్షలు చేయించుకుని భూమిలో గల ఖనిజ లవణాలను గుర్తించి అందుకు తగ్గట్టుగా వ్యవసాయం చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చునని ఈ సందర్భంగా ఆయన అన్నారు అనంతరం భూసార పరీక్షల వల్ల వచ్చే లాభాలను వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ పుంగనూరు సంచాలకులు శివకుమార్, మండల అధికారి మోహన్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తొమ్మిది రోజులు కాదు మూడు నెలలు గడువు కావాలి

## -కామ్రేడ్లు డిమాండ్.

**రైల్వే కోడూరు జూలై 14 రిపబ్లిక్ న్యూస్.**




సర్ ప్రోగ్రాం కార్యక్రమం తొమ్మిది రోజులు కాదు మూడు నెలలు కావాలి రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నామని రైల్వే కోడూరు సిపిఐ పార్టీ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య కౌన్సిల్ సభ్యుడు జయచంద్ర డిమాండ్ చేశారు, రైల్వే కోడూరు సిపిఐ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రెస్ మీట్ ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య. సిపిఐ పార్టీ రైల్వే కోడూరు నియోజకవర్గ కౌన్సిల్ సభ్యులు దాసరి జయచంద్ర.కటారి గోపాల్ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ గుజ్జుల ఈశ్వరయ్య ఆదేశాల మేరకు సర్ ప్రక్రియ మూడు నెలలు గడువు పెంచాలని రాష్ట్రవ్యాప్తంగాఆందోళన కార్యక్రమాలు జిల్లా కలెక్టర్లకు మరియు మండల తాసిల్దార్లకు వినతి పత్రాలు అందజేయగా కేంద్ర ప్రభుత్వం ఆలోచించి 15వ తేదీ నుండి 24 తేదీ వరకు 9 రోజులు గడువు పెంచడం సరి కాదని మూడు నెలలు గడువు పెంచితే ఎస్సీ ఎస్టీ గ్రామాలు మారుమూల ప్రాంతాలలో చదువు లేక తెలిసి తెలియక ఉంటున్నటువంటి అమాయక గిరిజన బిడ్డలు. దళిత బిడ్డల కోసం. వారు ఓటు హక్కుల కోసం గడువు పెంచాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కోరారు,లేని పక్షంలోజలన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని పోరాటాలకు సిద్ధమవుతామని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు హెచ్చరిక చేస్తున్నామన్నారు ఈ కార్యక్రమంలో పెంచలయ్య. రమణయ్య. సుబ్బలక్ష్మి అమ్మ. హరిబాబు. శైల. గంగయ్య. తదితరులు పాల్గొన్నారు

# చెరువులకు నీటి విడుదలకు మంత్రి సానుకూల స్పందన



**అమరావతి/ గుంతకల్, జూలై 14 : ( రిపబ్లిక్ న్యూస్)**

గుంతకల్లు నియోజకవర్గంలోని 12 చెరువులకు రాగులపాడు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుత్తిపామిడి టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ మంగళవారం వెలగపూడిలోని సచివాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.నియోజకవర్గంలో నెలకొన్న సాగునీటి అవసరాలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించారు. రాగులపాడు హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా 12 చెరువులకు నీటిని విడుదల చేసే అంశాన్ని పరిశీలించి, అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.మంత్రి ఇచ్చిన హామీతో నియోజకవర్గ రైతుల్లో ఆశలు చిగురించాయని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తెలిపారు. చెరువులకు నీరు అందితే వేలాది ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు రైతుల ఇబ్బందులు తీరుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, సాగునీటి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే జయరాం అన్నారు.

# తిరుమలలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

## సుగంధ ద్రవ్యాలతో ఆలయశుద్ధి నిర్వహణ




**తిరుమలజూలై 14, (రిపబ్లిక్ న్యూస్):**

తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా జరిగింది. 17న సాలకట్ల ఆణివార ఆస్థానం పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందనిలయం మొదలుకొని బంగారువాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రం చేశారు. స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచి, శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. ఏడాదిలో నాలుగుసార్లు ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.ఈ సందర్భంగా అష్టదళపాదపద్మారాధన సేవను తితిదే రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో తితిదే జేఈవో డాక్టర్ ఏ.శరత్, సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో లోకనాథం, పలువురు బోర్డు సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఒడ్డెలింగపూర్ గ్రామంలో తాటి చెట్టుపై నుండి పడి గాయపడిన తిరుపతి గౌడ్ ను పరామర్శించిన

## మాజీ మంత్రి BRS పార్టీ జనరల్ సెక్రెటరీ తాటిపర్తి జీవన్ రెడ్డి

**రాయికల్ పట్టణం జూలై 14( రిపబ్లిక్ న్యూస్)**



జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వడ్డె లింగాపూర్ అన్నింటికన్నా ప్రమాదకరమైన వ్యక్తి గీత కార్మిక వృత్తి దాదాపు 100 గజాలు గల తాడిచెట్టు పైనుండి పడితే ఇప్పుడు ఏమని అనిపించకపోయినా భవిష్యత్తులో చాలా కష్టమవుతుంది

కాటమయ్య కిట్ల పంపిణీ చేయాలని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ గారు ప్రారంభించారు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుండి కాటమయ్య కిట్ల పంపిణీ అనేది నామమాత్రంగా జరుగుతుంది

ఒక సంవత్సరంలోపు మొత్తం గీత కార్మికులకు కిట్ల పంపిణీ జరగాలి కానీ సంవత్సరానికి ఒక గ్రామం పంపిణీ చేస్తున్నారు ఇలా చేస్తే 10 సంవత్సరాలైనా అందరికీ కిట్లు అందవు గీత వృత్తిపై ఆధారపడ్డ వారికి బెల్ట్ షాపులు అనేటివి చాలా అవరోధంగా తయారైనవి గ్రామానికి 10 బెల్ట్ షాపులకు తక్కువగా లేవు లైసెన్సుడ్ షాపులు తక్కువగా ఉంటాయి లైసెన్సు లేనివి ఎక్కువగా ఉంటాయి

లైసెన్సులు షాపుకు టైం నిబంధనలు ఉంటాయి కానీ ఈ బెల్ట్ షాపులకు టైం నిబంధనలు ఉండవు

అర్ధరాత్రి ఫోన్ చేస్తే ఎక్కడికైనా తీసుకొని వచ్చి మందు ఇస్తారు ప్రభుత్వం ఆదాయ మార్గం మాత్రమే చూస్తుంది

ప్రభుత్వానికి తాత్కాలికంగా ఆదాయం దొరుకుతుంది కావచ్చు కానీ సమాజం ఏమవుతుంది

పోలీస్ శాఖ కండ్లకు గంతలు కట్టుకున్నట్టు చేస్తుంది

ట్రాఫిక్ పోలీసులే కాకుండా మొత్తం పోలీసు వ్యవస్థ సాయంత్రమైతే రోడ్లమీద పైపులు పట్టుకొని కూర్చుంటున్నారు తాగిపిచ్చేది పోలీస్ యంత్రాంగమే ముక్కు దగ్గర పైపు పెట్టేది పోలీస్ శాఖనే పోలీస్ శాఖకు జీతాలు ప్రభుత్వం ఇవ్వడం కాదు ఆ శాఖనే సంపాదించుకుంటుంది చెట్టు మీదకెళ్ళి పడితే డాక్టర్ సర్టిఫికెట్ ఎవరు ఇవ్వరు చెట్టు మీదకెళ్ళి పడితే కనీసం లక్ష రూపాయల ఖర్చు అవుతుంది ప్రభుత్వం 10,000 కూడా ఇస్తుందన్న గ్యారంటీ లేదు తాత్కాలిక వైకల్యం కలిగితే లక్ష రూపాయలు ఇవ్వాలి. శాశ్వత అంగవైకల్యం కలిగితే ఐదు లక్షలు ఇవ్వాలా ఒకవేళ గీత కార్మికుడు చనిపోతే 10 లక్షలు ఇవ్వాలి ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ హరిచరన్,బర్కం మల్లేష్,గోపి రాజిరెడ్డి,చింతలపెల్లి గంగారెడ్డి, కొయ్యడి మహిపాల్ ,మహేష్ గౌడ్,శంకర్ నాయక్,మండ రమేష్,హరీష్,సుదీర్,మల్లన్న,రవి, నాగరాజు, శ్రీధర్ రెడ్డి,సాయి వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు...

# రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపును పరిశీలించిన

## ఓంకార్ యాదవ్ ఎంఈఓ-2.

**ఓర్వకల్లు ప్రతినిధి, జులై 14(రిపబ్లిక్ న్యూస్)**





నన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న 5 రోజుల రాజ్య పురస్కార్ టెస్టింగ్ క్యాంపును సందర్శించి క్యాంపులో పాల్గొంటున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఇచ్చే ఒక ఉన్నతమైన ప్రామాణిక పరీక్ష మరియు పురస్కారం అని పేర్కొన్నారు. రాష్ట్ర, దేశ గుర్తింపు (జాతీయ పతాకం, జాతీయ గీతం, దీూ+ ప్రార్థన గీతం & జెండా పాట)

యూనిఫామ్ , సైన్ , సెల్యూట్ , లెఫ్ట్ హ్యాండ్ షేక్ , డైలీ గుడ్ టర్న్ ఔటింగ్ , లాగ్ బుక్ , కంపెనీ మీటింగ్స్ , ఎయిర్ క్రాఫ్ట్ మోడల్స్ , ఎయిరఫీల్డ్ మోడల్స్ వంటి అంశాలు ఉంటాయని, దీనివలన లీడరషిప్ , రెస్పాన్సిబిలిటీ , ప్లానింగ్ , టీంవర్క్ , క్రమ శిక్షణ నైపుణ్యాలు పెరుగుతాయని.

పర్యావరణం, ఆరోగ్యం, అంశాలలో జ్ఞానం కలిగిస్తారని భవిష్యత్తులో అదనపు ప్రయోజనాలు అనగా **ఉద్యోగ/ప్రవేశ ప్రక్రియలలో:**

**Navodhaya / NCC / NSS / Scouts Ê Guides** వంటి సేవా అంశాలలో గుర్తింపు ఇచ్చే చోట, రాజ్యపురస్కారం ఒక ఎడిషనల్ కోటా మార్కుల ప్రయోజనం కలుగు తుందని తెలియ జేశారు.

అనంతరం స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దులేటి రాజ్యపురస్కారం ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థి జీవితంలో ఉన్నత ప్రామాణికం రాజ్యపురస్కారం అని ఈ పరీక్ష ద్వారా నైపుణ్యాలు మెరుగు పరచుకోవడం మరియు ఇది స్కూల్లో "ఉన్నత నైపుణ్య గుర్తింపు" అని కూడా చూడవచ్చని దేశాభివృద్ధి సేవలో ఒక భాగమని, పరిశుభ్రత, ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పర్యావరణం వంటి అంశాలలో ప్రొఫిషియన్ బ్యాడ్జిలు తీసుకోవడం వలన సమాజ సేవ చేయడం నేర్చుకుంటారని,దేశాభివృద్ధిలో వారి స్వంత పాత్రను,గుర్తించగలుగుతారని ఇది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంస్థలో, ప్రతి రాష్ట్రంలో "రాజ్యపురస్కారం టెస్ట్" ద్వారా నిర్వహించే ఉన్నత స్థాయి పరీక్ష అని ఈ పరీక్షలో విజయం సాధించిన గైడ్స్‌కు రాష్ట్ర గవర్నర్ స్థాయిలో రాజ్యపురస్కారం బ్యాడ్జి మరియు పురస్కారం ఇవ్వబడుతుందని తెలిపారు. పిదప పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనంను ఓంకార్ యాదవ్ రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేసారు.ఈ టెస్టింగ్ క్యాంపును లీడర్ అఫ్ ది కోర్స్ శంకరమ్మ, సమన్వయ కర్త సుజన కుమారి పర్యవేక్షనలో జరుగుతున్నది.

# జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సర్ కార్యక్రమంపై ఆల్ పార్టీ సమావేశం.

## తల్లెం భరత్ కుమార్ రెడ్డి.

**రైల్వే కోడూరు జూలై 14 రిపబ్లిక్ న్యూస్.**








సర్ కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర ఐఏఎస్ ఆధ్వర్యంలో అన్ని పార్టీల జిల్లా నాయకులతో సమావేశం మంగళవారం నిర్వహించడం జరిగినదనివైఎస్ఆర్సిపి పార్టీ తల్లెం భరత్ కుమార్ రెడ్డి అన్నారు సర్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో వైఎస్ఆర్సిపి పార్టీ తరపున వైసీపీ రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్ తో మాట్లాడుతూ బిఎల్ ఏ, బిఎల్వోలు ఓటర్లకు సంబంధించి ఎన్యూమరేషన్ పత్రాల డిజిటలైజేషన్ చేసినటువంటి వాటిలో కొన్ని నెట్వర్క్ ప్రాబ్లం వల్ల డిజిటలైజేషన్ తిరిగి తొందరగా చేయవలసిందిగా కోరడమైనది, డిజిటలైజేషన్ పూర్తయిన ప్రతి ఓటర్కి తిరిగి రిసిప్ట్ ఇవ్వవలసిందిగా కోరుతున్నామని భరత్ కుమార్ రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించి దేశం అయినటువంటి ప్రతి ఓటర్కి రిసిప్ట్ అందజేయవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారిచేయడం జరిగినది,

# ఆత్మహత్యల నివారణ పై అవగాహన కార్యక్రమం






**కోసిగి జూలై 14 రిపబ్లిక్ న్యూస్**జిల్లా బాలల పరిరక్షణ ఆధ్వర్యంలో ఈరోజు .14.07.2026 తేదీన నేల రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోసిగి మండలము KGBV పాఠశాల లోలిలిభేటీ బచావో భేటీ ఫాడహో మరియు ఆత్మహత్యల నివారణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈసందర్భంగా సామాజిక కార్యకర్త యన్.నరసింహులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబడిన బేటి బచావో బేటి పడావో (బాలికను రక్షించండిబాలికను చదివించండి) ఈ పథకం యొక్క ప్రధానమైన ఉద్దేశము బాలికల లింగ నిష్పత్తిని పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకురావడం జరిగింధన్నారు నేటి సమాజంలో ఆడపిల్లలంటే ఆర్థిక భారము, అనే మూఢనమ్మకాలు ఉన్నవారికి ఈ పథకం ఎంతగాను ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా సమస్యలకు ఆత్మహత్య పరిష్కారము కాదని జీవితములో ఎదురయ్యే సవాళ్లను ధైర్యరంగా ఎదుర్కోకుంటూ ముందుకు సాగాలన్నారు.విదార్థి దశలో మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, చదువుల ఒత్తిడి, కుటుంబ సమస్యలు, నిరాశ, ఆందోళన వంటి కారణాలు మానసిక సమస్యలకు దారి తీస్తాయన్నారు.సమస్యలు ఎదురైనప్పుడు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, స్నేహితులు లేదా అధికారులకు తెలియ చేసి వారి సలహాలు,సూచనలు తీసుకోవాలన్నారు, మరియు తల్లిదండ్రులు మందలించారని స్నేహితుల అవమానించారని పరీక్షలో ఫెయిల్ అయ్యామని మొదలైన సమస్యల వల్ల మానసిక ఒత్తిడి లోనే ఆత్మహత్యలకు పాల్పడడం సమస్యకు పరిష్కారం కాదని తెలిపారు ప్రశాంతంగా ఆలోచిస్తే ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని మానసిక నిర్భరం కలిగి జీవించాలా ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు నెగిటివ్గా ఆలోచన చేయకుండా పాజిటివ్గా ఆలోచిస్టే సమస్యకు పరిష్కారం తెలుస్తుంది అన్నారు ముఖ్యంగా విద్యార్థులలో సెల్ఫ్ కాన్ఫరెన్స్ పెంపొందించాలంటే చదువుతోపాటు ఆటలు క్రీడలు యోగ, మెడిటేషన్ మొదలైనటువంటివి నిత్యజీవితంలో అలవాటు చేసుకోవడం వల్ల సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లెవెల్స్ డెవలప్ అవుతాయిన్నారు. .ముంక్యంగా కొంత మంది విద్యార్థులు పరిక్షల సమయములో పరిక్షల భయముతో మరియు పరీక్షలలో ఫెయిల్ అయినప్పుడు ఆత్మహత్య లకు పల్బడడము జరుగుతుంది ఆది సమస్య కు పరీక్షపరిష్కారము కాదు. చదువును ఇష్టంతో చదువుతూ మరియు ఒక్క ప్లాన్ ప్రకారం లేదా ఒక్కగోలు పెట్టుకొని చదువుతే విజయము సాధించవచ్చన్నారు. విదార్థులలో సమస్యలు మనసులో దాచుకుంటే అవి ఆందోళనకు దారి తీస్తాయన్నారు. మరియు బాలల హక్కులకు,బాలల రక్షణకు భంగము కలిగినప్పుడు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, ఉమేన్ హెల్ప్ లైన్ 181, ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ 100,112 మొదలైన హెల్ప్ లైన్ నెంబర్లకు సమస్యలను తెలియ చేసి పరిష్కరించుకోవాలనీ వారికి అవగాహన కల్పించడం జరిగినది. అనతరము బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయడం జరిగిందిఈ కార్యక్రమంలో KGBV ప్రిన్సిపాల్ షబానా మరియు ఉపాధ్యానీయులు పాల్గొన్నారు.

# ప్రహసనంగా మారిన సర్ ప్రక్రియ !

**జులై 14, (రిపబ్లిక్ న్యూస్):**
ఆధార్ సక్రమంగానే ఉంటోంది. పాన్ కార్డు సక్రమంగానే ఉంటోంది. గ్యాస్ కనెక్షన్ కూడా పక్కాగా ఉంటోంది. బ్యాంక్ అకౌంట్ కూడా పక్కాగానే ఉంటోంది. ఇంటినంబర్లు, చెల్లింపులు ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ పక్కాగా ఉంటున్నా..ఓటు మాత్రం పక్కాగా ఉండడం లేదు. ఎఐని అడిగితే ఎలా పక్కాగా చేయవచ్చో చెబుతుంది. ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తే పక్కాగా ఓటరు కార్డు వస్తుంది. కానీ ఎన్నికల సంఘం, కేంద్రానికి ఇవేమీ పట్టడం లేదు. పర్మినెంట్ ఓటరు కార్డు నంబర్ ఉంటే ఓటు కోసం గందరగోళం పడాల్సిన అవసరం లేదు. ప్రజలు ఎవరికి వారు తమ ఓటును పక్కాగా ఉంచుకుంటారు. ఎవరైనా అడ్రస్ మారితే మార్చుకుంటారు. ఆధార్ విషయంలో ఇదే జరుగుతోంది. కానీ ఘనత వహించిన ఎన్నికల సంఘం మాత్ర దీనిని ఓ మాయగా తయారు చేసింది. చదువుకున్న వారికి సైతం అర్థం కాని ప్రక్రియగా చేశారు. టెక్నాలజీ ఇంతగా పెరిగినా ఉపయోగించుకోవడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలం అయ్యిందని చెప్పాలి. తాజాగా కొనసాగుతున్న సర్ ప్రక్రియ ఓ ప్రహసనంగా మారంది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ పక్రియ తీరు క్షేత్రస్థాయిలో ఘోరంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అందరికీ ఎన్యుమరేషన్ ఫామ్‌లు పంచేసి రికార్డు సృష్టించామని అధికారులు చెప్తున్న లెకలకు, క్షేత్రస్థాయిలో ఓటర్లు ఎదురొంటున్న వాస్తవ పరిస్థితులకు అస్సలు పొంతన కుదరడం లేదు. ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ దాదాపు వందశాతం పూర్తయినట్టు రికార్డుల్లో చూపిస్తున్న ప్రాంతాల్లో కూడా కనీసం బూత్ లెవల్ అధికారులు అంటే బీఎల్‌వోలు అడుగుపెట్టలేదని ఓటర్లు చెబుతున్నారు. కొందరైతే వారెలా ఉంటారో కూడా చూసి ఉండలేదంటున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 99.98 శాతం మందికి ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ పూర్తయింది. 26 జిల్లాల్లో ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ వంద శాతం పూర్తి చేశామని అధికారులు కాగితాల్లో లెకలు చూపిస్తున్నారు. ఉన్నతాధికారుల సమీక్షల్లో శభాష్ అనిపించుకోవడానికి క్షేత్రస్థాయి సిబ్బంది చూపించిన ఈ అంకెల గారడీ ఇప్పుడు ఓటర్ల పాలిట శాపంగా మారింది. అధికారులు వంద శాతం పంపిణీ అని చెప్తుంటే.. నగర, పట్టణ ప్రాంతాల ఓటర్లు మాత్రం 'మా కాలనీ, మా ఇండ్లకు అసలు బీఎల్‌వోలు వచ్చిన దాఖలాలే లేవు. మాకు అందాల్సిన ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఎటు పోయాయని



ప్రశ్నిస్తున్నారు. దీని బదులు ఏ మీసేవా సెంటర్‌లో పెట్టినా హాయిగా వెళ్లి సవరణలు చేసుకునే వారమని అంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, దాని చుట్టుపకల ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, శివారు కాలనీల్లో చాలామందికి ఫామ్‌లు అందనే లేదు. అధికారులు ఇండ్ల వద్దకు వచ్చి వివరాలు సేకరించకుండానే, ఆఫీసుల్లో కూర్చొని ఫామ్‌ల పంపిణీ అయిపోయినట్టు టిక్ మార్కులు పెట్టేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీత గడువులోగా పక్రియ పూర్తి చేయాలనే పైఅధికారుల ఒత్తిడికి భయపడి క్షేత్రస్థాయి సిబ్బంది తూతూమంత్రంగా పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సర్ నిబంధనల ప్రకారం బీఎల్‌ఓలు మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలన్న నియమం ఉన్నా కనీసం ఒక్కసారి కూడా క నిపించకుండానే పోతున్నారు. నగరాలు, పట్టణాల్లో ని అనేక కాలనీల్లో బిఎల్‌వోలు సందర్శించిన ప్రాంతాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెప్పుకుంటోది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్‌ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు
కనపడుతున్నాయి. ఇపూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్‌ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ పక్రియ దరిద్రంగా సాగుతోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరం లేదు. గతంలో బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ప్రజలు గగ్గోలు పెడుతుంటే ..ఇక్కడ ఉన్నవారికి అదో వింతగా అనిపించింది. కానీ ఇప్పుడు మనకు అనుభం కావడంతో అసలు ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రక్రియ ఇలాగే సాగితే తెలుగు రాష్ట్రాల్లో కనీసం 50 శాతం ఓట్లు గల్లంతు కావడం ఖాయం. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదు. అలాగే తొలగించడం కూడా సరికాదు. ఆధార్ కార్డును ఓటరుగా గుర్తించేందుకు ఉపయోగ పడదని ఇప్పటికే ఇసి తేల్చి చెప్పింది. ఆధార్ కార్డు ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో అర్థం చేసుకోవాలి. నిజానికి ఓటు నమోదు, తొలగింపే ఓ ప్రహసనంగా మారడం విడ్డూరంగా ఉంది. పక్కాగా ఓటరు కార్డును తయారు చేయలేని దౌర్భాగ్యస్థితిలో ఎన్నికల సంఘం ఉంది. సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందివుంటే ..దానిని గుర్తించి ఏరివేయాలి. ఓటరు జాబితాలోచనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయంటే అందుకు ఎన్నికల సంఘం సక్రమ నిర్వహా లోపమే కారణం. సరైన టెక్నాలజీని వాడడం లేదు. ఎన్నో ఐటి కంపెనీలు ఉన్నాయి. వారికి అప్పగిస్తే ఎలా ఓటు నమోదు చేయాలో, దానికి ఎలా పర్మినెంట్ నంబర్ ఉండాలో చెబుతారు. బిఎల్‌వోలు ఇంటింటికీ తిరగకుండా గ్రామస్థాయిలో పంచాయితీల సహకారం తీసుకోవాలి. పట్టణాల్లో వార్డుస్థాయి అధికారుల సహాయం తీసుకుంటే బాగుండేది. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఈ తంతు మొత్తం తలనొప్పిగా ఉందే తప్ప సజావుగా ఓటను పదిలపర్చుకునేలా లేదు. ఇలాంటి తలనొప్పులను అధికారులు గుర్తించడం లేదు. అది ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం.

# ఎండల తీవ్రతకు పెరిగిన విద్యుత్ డిమాండ్

## హైదరాబాద్‌లోఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి

**హైదరాబాద్,జులై 14, (రిపబ్లిక్ న్యూస్):**
ఎండల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ భారీగా నమోదవుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో ఏసీలు, కూలర్ల వాడకం పెరిగిందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది జూలై రెండు వారాల్లో రోజువారీ విద్యుత్ వినియోగం 61-71 మిలియన్ల యూనిట్లు ఉండగా, ఈ ఏడాది జూలై 11 తేది నాటికి 71-82 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవు తోంది. నగరంలో సాధారణం కంటే 4-5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2-3 డిగ్రీలు పెరిగే అవకాశాలుంటాయని వాతావరణశాఖ అధికారులు



చెబుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో సోమవారం గరిష్ఠంగా 36.7 డిగ్రీలు, కనిష్ఠం - 25.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భానుడి భగ.. భగలకు నగరవాసులు అల్లాడిపోతున్నారు. వర్షాకాలం లోనూ వేసవి తరహాలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో నగరవాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 1 నుంచి జూలై 13 వరకు హైదరాబాద్ జిల్లాలో సాధారణంగా 175 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 100.1 మిల్లిమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 43 శాతం తక్కువని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో సాధారణం కంటే 26 శాతం, మేడ్చల్- మల్కాజిగిరిలో 54 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 28 తక్కువ వర్షపాతం ఈ సీజన్‌లో నమోదైంది.మరో వారం రోజులు భారీ వర్ష సూచనలు కన్పించడం లేదని బేగంపేట సీనియర్ వాతావరణశాఖ అధికారి జీఎన్‌ఆర్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం సాధారణం కంటే 3-4 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నగరంలో నమోదవుతున్నాయి. మరో 2-3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది.

# సరిహద్దుల్లో అమెరికాన్ మాజీ సోల్జర్ అరెస్ట్

## అనుమానాస్పదంగా తచ్చాడుతుండగా పట్టివేత -పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అనుమానాలు

**న్యూఢిల్లీ,జులై 14, (రిపబ్లిక్ న్యూస్):** భారత్-నేపాల్ సరిహద్దులో సశస్త్ర సీమా బల్ మరో అమెరికన్‌ను అదుపులోకి తీసుకుంది. అమెరికా డ్రోన్ నిపుణుడు మాథ్యూ వాన్‌డైక్‌ను ఇటీవల మణిపుర్‌లోభారత సైన్యం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమెరికా మాజీ సైనికుడిని ఎస్ఎస్‌బి అదుపులోకి తీసుకుంది. అతడిని కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా గుర్తించారు. సరైన ప్రయాణ పత్రాలు లేకుండా నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని ఎస్ఎస్‌బి జవాన్ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జవాన్ నుంచి తప్పించుకొని పారిపోతుండగా.. స్థానికులు పట్టుకొని భద్రతా సిబ్బందికి అప్పగించారన్నారు. విచారణ సమయంలో బ్రౌన్ పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడని అధికారులు తెలిపారు. బ్రౌన్ 2025 నవంబర్‌లో సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి ప్రవేశించి.. అప్పటి నుంచి గోవాలో నివసిస్తున్నట్లు గుర్తించామన్నారు. సరైన పత్రాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించినందుకు ఇమిగ్రేషన్ అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. విచారణలో అతడు బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్‌లకు వెళ్లినట్లు తేలిందన్నారు. తాను కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో



చదువుకున్నానని.. ఆరేళ్లపాటు అమెరికా సైన్యంలో పని చేశానని బ్రౌన్ వెల్లడించారు. రెండేళ్ల క్రితం సైన్యం నుంచి వైదొలిగానన్నారు. మూడేళ్ల క్రితం తాను ఇటలీ పర్యటనలో ఉన్న సమయంలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళను కలిశానని.. 2024 అక్టోబర్‌లో ఆమెను వివాహం చేసుకున్నానని తెలిపారు. అనంతరం టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని.. అక్కడ పాస్‌పోర్టు పోవడంతో తాను సముద్ర మార్గంలో భారత్‌కు వచ్చినట్లు వెల్లడించారు. గోవాలో పరిచయమైన ఓ నేపాల్ వ్యక్తిని కలవడానికి ఆ దేశానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ గురించి ప్రశ్నించగా బెంగళూరులోని ఓ పరిచయస్థుడి వద్ద ఉందని చెప్పారు. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో అరెస్టైన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా నుంచి తెచ్చిన డ్రోన్లను ఈశాన్య భారతం గుండా మయన్మార్‌లోని తిరుగుబాటుదారుల గ్రూపులకు అందించినట్లు సమాచారం. ఇలా డ్రోన్లను దొంగ రవాణా చేయడం, వాటి కూర్పు, మరమ్మతులు, ఎలక్ట్రానిక్ యుద్ధరీతులలో మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడం వాన్‌డైక్ బృందం పని అని నాడు రష్యా వెల్లడించింది. విదేశీయులు మిజోరంలో ప్రయాణించాలంటే రక్షిత ప్రాంత పర్మిట్ (పీఏపీ) తప్పనిసరి. కానీ, నిందితులు అలాంటి అధికార అనుమతులు లేకుండానే ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశించారనేది ఆరోపణ.వాన్‌డైక్ అరెస్టు ఒక కొత్త ధోరణిని సూచిస్తోంది. విదేశీ కిరాయి సైనికులు భారత భూభాగం గుండా ఇతరులకు ఆయుధాలు, డ్రోన్ల బట్వాడాకు నడుంకట్టారు. వారు భారత్‌ను కీలకమైన రవాణా మార్గంగా వాడుకోవాలని చూస్తున్నారు. వాన్‌డైక్ 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు. లిబియా అంతర్యుద్ధ సమయంలో గడాఫీకి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా వార్తల్లోకి వచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో పర్యటించాడు. సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొన్నాడు. 2022 మార్చి నుంచి అతని సంస్థ ఉక్రెయిన్‌లో రష్యాకు వ్యతిరేకంగా పనిచేస్తోంది.

# పల్నాడు జిల్లాలో విషాద ఘటన

## పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య



**పల్నాడు,జులై 14, (రిపబ్లిక్ న్యూస్):**
పల్నాడు జిల్లాలోని వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలను హత్య చేసి, తానూ ఆత్మహకు పాల్పడింది. తల్లి నక్క భారతి(28) తన ఇద్దరు కుమారులు హేమంత్ రెడ్డి(5), తేజ(3)ను హత్య చేసిన అనంతరం తాను ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం వెలుగులోకి వచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటన గురించి తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోగా, కుటుంబ సభ్యుల రోదనలు హృదయాలను కలిచివేశాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు లేదా ఇతర వ్యక్తిగత కారణాల వల్లే ఈ ఘటన జరిగిందా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. ప్రస్తుతం పోలీసులు అన్ని ఆధారాలను పరిశీలిస్తూ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# వియత్నాం నుంచి ముగ్గురి డెడ్ బాడీల రాక

## శంషాబాద్‌లో ప్రత్యే అంబులెన్స్‌ల ద్వారా తరలింపు

## ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**అమరావతి,జులై 14, (రిపబ్లిక్ న్యూస్):** వియత్నాంలో జరిగిన పడవ ప్రమాదంలో మృతిచెందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురి మృతదేహాలు మంగళవారం ఉదయం 7:30 గంటలకు హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం కార్గో టెర్మినల్‌కు చేరుకున్నాయి. మృతుల్లో కడప జిల్లాకు చెందిన శ్రీధర్, మచిలీపట్నానికి చెందిన జయశ్రీ, హిందూపురానికి చెందిన రవితేజ ఉన్నారు. మృతదేహాలను భారత్‌కు తీసుకురావడానికి అవసరమైన అన్ని చట్టపరమైన పక్రియలను ముంబైలో పూర్తి చేసిన తర్వాత కుటుంబసభ్యులకు అధికారులు నేరుగా అప్పగించారు. అనంతరం శంషాబాద్ విమానాశ్రయం నుంచి వారి స్వస్థలాలకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఏపీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ.. కుటుంబసభ్యులకు, సన్నిహితులకు ధైర్యం చెప్పారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు పంపించే పక్రియను స్వయంగా పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి కడప, మచిలీపట్నం, హిందూపురం ప్రాంతాలకు మృతదేహాలను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత అంబులెన్స్ సదుపాయం కల్పించింది. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు.

# ఇంద్రకీలాద్రిపై పెరిగిన రద్దీ

## అమ్మవారి దర్శనానికి పెరిగిని భక్తుల రాక



**విజయవాడజులై 14, (రిపబ్లిక్ న్యూస్):** ఆషాడం మొదలు కానుండడంతో బెజవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమావాస్య మంగళవారం కూడా మంచిదన్న భావనతో అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలి రావడంతో భక్తజన సందోహంతో కళకళలాడింది. తెల్లవారు ఝాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికై తరలి వచ్చారు. అమ్మవారి ప్రసాదాలను కూడా భక్తులు పెద్ద ఎత్తుననే స్వీకరించారు. దర్శనం అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని ఆస్వాదించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, ప్రసాదాల పంపిణీ, భద్రత, వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆషాఢ మాసంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతుండటంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అమ్మవారి దర్శనం, ప్రసాద సేవ, అన్నదానం, తలనీలాల సమర్పణతో ఆదివారం ఇంద్రకీలాద్రి భక్తి పారవశ్యంతో కళకళలాడింది. భక్తులందరూ అమ్మవారి ఆశీస్సులతో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ప్రార్థిస్తూ ఆలయం నుంచి ఆనందంగా తిరుగు ప్రయాణం అయ్యారు.
--------

# కర్నూలులో రోడ్డు ప్రమాదం.. ఏపీఎస్పీ హెడ్ కానిస్టేబుల్ దుర్మరణం.

**జాగింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ ఫ్లైఓవర్‌పై నుంచి పడి మృతి.**



**కర్నూలు, జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):** కర్నూలు నగరంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సోమవారం ఉదయం ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బళ్లారి చౌరస్తా సమీపంలోని జాతీయ రహదారిపై జాగింగ్ చేస్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఆయనను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు అదుపుతప్పి ఫ్లైఓవర్ బ్రిడ్జి పైనుంచి కిందపడిన వరప్రసాద్ రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు.సమాచారం అందుకున్న కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించి, మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు మెడికల్ కాలేజీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న ట్రాఫిక్ పోలీసులు ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనం కోసం దర్యాప్తు చేపట్టారు. హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ రెడ్డి మృతితో ఏపీఎస్పీ రెండో బెటాలియన్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను

# మధ్యాహ్నం లోపు పూర్తి చేయాలి.

**..జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.**

**కర్నూలు, జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను ఈరోజు లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సంబంధిత ఎన్నికల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఈఎఫ్ డిజిటైజేషన్, అన్‌కలెక్టబుల్ డేటా ఎంట్రీలు, ఏఎస్‌డీడీ నమోదు తదితర పనుల పురోగతిపై కలెక్టర్ సంబంధిత ఈఆర్ఓ, ఏఈఆర్ఓ లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏఎస్‌డీడీ జాబితాకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో ధృవీకరించి మాత్రమే చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు లకు స్పష్టం చేశారు. కర్నూలు (99.39 శాతం), పాణ్యం (97.22 శాతం) నియోజకవర్గాల పెండింగ్ పనులను మధ్యాహ్నం లోపు పూర్తిచేయాలన్నారు. అదే విధంగా ఎమ్మిగనూరు (99.55 శాతం), మంత్రాలయం




(99.37 శాతం), ఆదోని (99.47 శాతం), ఆలూరు (99.97 శాతం) నియోజకవర్గాల అధికారులు కూడా పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పత్తికొండ, కోడుమూరు మినహా మిగతా అన్ని నియోజకవర్గాలు నిర్ణీత గడువులో పూర్తిస్థాయికి చేరుకోవాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా అందిన ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌ను కూడా తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆన్లైన్ లో వచ్చిన ఎన్యూమరేషన్ ఫార్మ్స్ ప్రస్తుతం పాణ్యంలో 48, కర్నూలులో 13, ఎమ్మిగనూరులో 6, ఆదోనిలో 4, కోడుమూరు మరియు మంత్రాలయంలో ఒక్కో ఫారం చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ, ఇవన్నీ మధ్యాహ్నం లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. బుక్ ఏ కాల్ కు సంబంధించి పెండింగ్ రిక్వెస్ట్ లు 184 ఉంటే, 48 గంటల కంటే ఎక్కువ సమయం నుండి పెండింగ్ లో ఉన్న రిక్వెస్ట్స్ 26 ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బి ఎల్ ఎ మినిట్స్ ను 2203 బి ఎల్ ఓ లలో కేవలం 241 మంది బి ఎల్ ఓ లు మాత్రమే ఆన్లైన్ లో అప్లోడ్ చేశారన్నారు. మిగిలిన బి ఎల్ వో లు కూడా వెంటనే అప్లోడ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి చేసిన తనిఖీలకు ఆధారంగా, పొరుగువారి సంతకాలతో కూడిన పంచనామా ప్రొఫార్మాలను సిద్ధం చేసి భద్రపరచాలని కలెక్టర్ సూచించారు. దీంతో బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. జూలై 21న ముసాయిదా (డ్రాఫ్ట్) ఓటరు జాబితా ప్రచురించిన అనంతరం, ఓటరు జాబితాలో పేరు లేకపోవడం, వివరాల్లో పొరపాట్లు ఉండటం లేదా ఇతర అభ్యంతరాలు ఉన్నట్లయితే సంబంధిత క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిర్దేశిత విధానంలో సమర్పించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. టెలి కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, ఆదోని ఈఆర్ఓ మధుసూదన్ రెడ్డి, పత్తికొండ ఆర్డీఓ ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు..

# ప్రజల సానుకూల దృక్పథం 80% కు రావాలి

**..గ్యాస్ బాయ్స్ అదనపు డబ్బులు తీసుకుంటే ఏజెన్సీ పై కఠిన చర్యలు.**

**..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి.**

**..ఏజెన్సీలు గ్యాస్ బాయ్స్ కి బ్యాంకు,డిజిటల్ పేమెంట్ ల ద్వారా జీతాలు చెల్లించాలి.**

**..ఇకపై ఎటువంటి పొరపాట్లు జరిగిన ఉపేక్షించేది లేదు.**

**..జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.**



**కర్నూలుజూలై 14, (రిపబ్లిక్ న్యూస్):** గ్యాస్ ఏజెన్సీలు ప్రజల సానుకూల దృక్పథం ( పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ ) లో మంచి గుర్తింపు సాధించి జిల్లా ను మంచి స్థానం లో ఉండేలాగా చర్యలు తీసుకోవాలి అని పౌరసరఫరాల శాఖ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.పేర్కొన్నారు.

మంగళవారం కలెక్టర్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం దీపం-2 పథకం ద్వారా ప్రజల కు ఉచితంగా గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తూ ఉన్నప్పటికీ ప్రజల నుండి సానుకూల దృక్పథం ( పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ ) రాకపోవటానికి కారణం గ్యాస్ ఏజెన్సీలు మరియు డెలివరీ బాయ్స్ కారణమని తెలిపారు. ఇప్పటికే చాలాసార్లు ఈ విషయంపై సూచనలు ఇవ్వడం , శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. డెలివరీ బాయ్స్ అదనపు సొమ్ము వసూలుకు పాల్పడం వలన ప్రజల సానుకూల దృక్పథం సూచిక లో వెనుకబడి ఉన్నామని ఈ విషయంలో ఏజెన్సీలు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఐఓసీ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ) సంస్థ ఇప్పటికే మూడు ఏజెన్సీ లపై చర్యలు తీసుకున్నదని తెలిపారు. కొన్ని ఏజెన్సీలపై 2 లక్షల రూపాయల నుండి 8 లక్షల రూపాయల వరకు పెనాల్టీలు కూడా విధించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.పెద్ద కడుబూరు చెందిన మాధురి గ్యాస్ ఏజెన్సీ కి ఎన్నిసార్లు హెచ్చరించిన సరైన చర్యలు తీసుకొననందున ఆ ఏజెన్సీ పై చర్యల లో భాగంగా వారి కస్టమర్లను సమీపంలోని గ్యాస్ ఏజెన్సీకి ట్యాగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కావున గ్యాస్ ఏజెన్సీలు చిత్తశుద్ధితో ప్రజలకు గ్యాస్ సరఫరా చేసి ప్రజా సానుకూలత పెంచే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ... గ్యాస్ డెలివరీ బాయ్స్ లు ప్రజల కు సిలిండర్ ఇచ్చాక అదనపు మొత్తం తీసుకొనరాదు.ఏజెన్సీ లు డెలివరీ బాయ్స్ కు జీతం బ్యాంక్ లేదా డిజిటల్ పేమెంట్స్ ద్వారా మాత్రమే చెల్లించాలి,ఈ విధంగా చేయక పోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్యాస్ ఏజెన్సీ లు శివ బాలాజీ సి-బెలగల్ , మాధురి గ్యాస్ ఏజెన్సీ పెద్దకడబూరు , విజయ గ్యాస్ కర్నూల్ , సూర్య గ్యాస్ ఏజెన్సీ , విష్ణుప్రియ మొదలగు గ్యాస్ ఏజెన్సీలను సమీక్షిస్తూ ఎంతమంది గ్యాస్ బాయిస్ ఉన్నారు , ఎన్ని వాహనాలు ఉన్నాయి వారికి జీతం ఏ విధంగా ఇస్తున్నారు , ఎంతమందిని కంప్లైంట్స్ పై తీసివేశారు ,అన్న విషయాలను అడిగి తెలుసుకుని ఎటువంటి పరిస్థితుల్లోనూ గ్యాస్ బాయ్స్ అదనపు సొమ్ము వసూలు చేయరాదని మరియు గ్యాస్ బాయ్స్ కు జీతం ఆన్లైన్ ద్వారానే చెల్లించాలని ఆదేశించారు. గ్యాస్ బాయ్స్ కు అందజేసే జీతాల వివరాలు మరియు సరఫరా కు వినియోగించే వాహనాల వివరాలు డిఎస్ఓ కార్యాలయానికి అందజేయాలని ఏజెన్సీ లను ఆదేశించారు. ఇకపై గ్యాస్ ఏజెన్సీలు ఎటువంటి పొరపాట్లు చేసిన ఉపేక్షించేది లేదని జాయింట్ కలెక్టర్ తెలియజేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ ల పనితీరును సమీక్షించారు. ప్రతి గ్యాస్ ఏజెన్సీ కి వెళ్లి ఈ విషయాల పై తనిఖీలు జరిపి నివేదికలు అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లా పౌర సరఫరా అధికారి రాజా రఘువీర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలోని 41 ఏజెన్సీల పనితీరును , ప్రజా సానుకూలత దృక్పథం వివరాలు సమావేశంలో వివరించారు. ఈ సమావేశం లో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రాజా రఘు వీర్ , ఏడి మార్కెటింగ్ నారాయణ మూర్తి , సివిల్ సప్లై డిప్యూటీ తాహసీల్దారులు , గ్యాస్ కంపెనీ ల ప్రతినిధులు మరియు జిల్లా గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు సబ్ డివిజన్‌లోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ

**జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**

**జానాలగూడెం చెంచు గ్రామాన్ని సందర్శించి ప్రజలతో ముఖాముఖి మాట్లాడిన జిల్లా ఎస్పీ**

**ప్రజలకు పోలీసు సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి**

**ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే జిల్లా పోలీసు శాఖ అత్యున్నత ప్రాధాన్యత జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్**






**నంద్యాల క్రైం, జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):** జిల్లా ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా పోలీసు అధికారి సునీల్ షోరాణ్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, లాకప్ గదులు, స్టేషన్ నిర్వహణ, సిబ్బంది హాజరు వివరాలు, స్టేషన్ రికార్డులు, కేసు నమోదు తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించి, వాటిని త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని గ్రామాల పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, శాంతిభద్రతల పరిస్థితి, గ్రామాల్లో పోలీసింగ్ విధానం తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందేలా ప్రతి పోలీసు అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. తదుపరి జానాలగూడెం చెంచు గ్రామాన్ని స్వయంగా సందర్శించిన జిల్లా ఎస్పీ గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో ఐకమత్య వాతావరణాన్ని కొనసాగిస్తూ ఎలాంటి గొడవలు, వివాదాలకు తావు ఇవ్వకుండా పరస్పర సహకారంతో జీవించాలని సూచించారు. అలాగే పిల్లలకు విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా ప్రతి కుటుంబం కృషి చేయాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ "ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే జిల్లా పోలీసు శాఖ యొక్క అత్యున్నత ప్రాధాన్యత. ప్రజలకు పోలీసు సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుంది" అని తెలిపారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ షెడ్యూల్ సవరణ.

**సవరించిన షెడ్యూల్ మేరకు కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలి.**

**ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలి.**

**..జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




**నంద్యాల, జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 01.07.2026 అర్హత తేదీతో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమానికి సంబంధించి సవరించిన షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, ఆంధ్రప్రదేశ్ సంబంధిత అధికారులకు సవరించిన కార్యాచరణ షెడ్యూల్‌ను అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటి సర్వే కార్యక్రమం 2026 జూన్ 15 నుండి జూలై 24 వరకు కొనసాగనుందన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను జూలై 24 నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనుండగా, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరించబడతాయని కలెక్టర్ తెలిపారు. అనంతరం జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు అందిన క్లెయిమ్స్, అభ్యంతరాలను విచారించి పరిష్కరించే ప్రక్రియ చేపట్టి, అక్టోబర్ 3, 2026న తుది ఓటరు జాబితా ప్రచురించబడుతుందని కలెక్టర్ తెలిపారు. భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన సవరించిన షెడ్యూల్‌ను సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్ఓలు, ఎన్నికల సిబ్బంది తక్షణమే అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రజలకు ఈ షెడ్యూల్‌పై పూర్తి అవగాహన కల్పించేందుకు అందుబాటులో ఉన్న అన్ని ప్రచార మాధ్యమాలను వినియోగించి విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు సవరించిన షెడ్యూల్‌ను లిఖితపూర్వకంగా తెలియజేసి, ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశించారు.

# దంపతుల ఆత్మహత్య





**నంద్యాల క్రైం, జూలై 14, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని సంజీవ్‌నగర్‌లో మంగళవారం హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. వృద్ధ దంపతులు అంకిరెడ్డి (65), అనురాధ (56) తమ నివాసంలోని వేర్వేరు గదుల్లో ఉరివేసుకుని మృతిచెందారు. వయోభారం కారణంగా కుమారుడికి భారంగా మారకూడదనే ఆవేదనతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమిక విచారణలో పోలీసులు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. వారి మృతితో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com